ప్రజాశక్తి
సోమవారం 8 ఏప్రిల్ 2024 8 పేజీలు
గుంటూరు పల్నాడు





నేతల మందుచూపు!

- ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు మద్యం తెచ్చేందుకు సన్నాహాలు
- గెలుపునకు ముందస్తు ప్రయత్నాలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకోవడానికి వివిధ రూపాల్లో ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ నుంచి అడ్డంకులు పెరుగుతుండటంతో ముందస్తుగానే తమ ప్రయత్నాలును ముమ్మరం చేశారు. తమ అనుయాయులకు చెందిన రహస్య స్థావరాల్లో మద్యం నిల్వ చేసుకుంటున్నారు. రాష్ట్రంలో మద్యం ధరలు ఎక్కువగా ఉండటంతో ఇతర రాష్ట్రాల నుంచి ఎక్కువగా దిగుమతి చేసుకుంటున్నారు. అధికారులు ఎన్ని చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినా రహస్య స్థావరాలకు తరలిపోతోంది. డబ్బు పంపిణీకి నగదు తెచ్చుకుని రహస్య స్థావరాలకు తరలిస్తున్నారు. జిల్లా, డివిజన్, నియోజకవర్గ కేంద్రాల నుంచి ముఖ్యమైన గ్రామాలకు ఇప్పటికే డబ్బు, మద్యం ఎలా తరలించాలనే అంశంపై ఆయాపార్టీల అగ్రనాయకత్వం నుంచి సూచనలు వస్తున్నాయని తెలిసింది.

గతంలో జిల్లాలోని టిడిపి, వైసిపి పార్టీలకు చెందిన వారికే ఎక్కువ మద్యం దుకాణాలు, బార్లు ఉండేవి. కొన్నేళ్లుగా ప్రభుత్వం మద్యం దుకాణాలను నిర్వహిస్తుండటం వల్ల ప్రతిపక్ష పార్టీల వారికి సరుకు దొరకని పరిస్థితి ఉండటంతో ఇతర రాష్ట్రాలపై దృష్టి సారించారు. అంతేగాక రాష్ట్రంలో మద్యం నాణ్యత లేదు. ధరలు అధికంగా ఉంటున్నాయి. దీంతో ప్రభుత్వం విక్రయిస్తున్న మద్యం బ్రాండ్లపై మద్యం ప్రియులు అసంతృప్తిగా ఉన్న నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాల నుంచి అర్డర్లపై కొనుగోలు చేసి రహస్య స్థావరాలకు తరలిస్తున్నారు. ప్రధానంగా గుంటూరు, పల్నాడు జిల్లాలకు తెలంగాణ నుంచి ఎక్కువగా మద్యం నిల్వలటు వచ్చే అవకాశం ఉంది. కొంత మంది ఉత్తరాది రాష్ట్రాల నుంచి కూడా తెచ్చుకోవాలని యోచిస్తున్నారు. పెదనందిపాడు మండలం వరగానిలో రెండు రోజుల క్రితం అధికారులు హర్యానా మద్యంను ఎస్ఈబి అధికారులు స్వాధీనం చేసుకున్నారు.



గుంటూరు జిల్లా పెదనందిపాడులోని వరగానిలో ఇటీవల స్వాధీనం చేసుకున్న హర్యానా మద్యం

గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని ఎక్కువ మంది అభ్యర్థులు ఆయా నియోజకవర్గాల్లో తమకు అనుకూలంగా ఉన్న వ్యాపారులు, బంధువుల నివాసాలకు మద్యం,డబ్బు తరలిస్తు న్నారు. నర్సరావుపేట లోక్‌సభ పరిధిలో మద్యం వినియోగం ఎక్కువగా ఉంటోంది. నియోజకవర్గాల్లో వివిధ సామాజిక వర్గాల గ్రూపు నాయకుల ద్వారా మద్యం పంపిణీకి సన్నాహాలు చేసుకుంటున్నారు. ఎన్నికలకు ముందుగానే మద్యం, డబ్బు పంపిణీతోనే పోల్ మేనేజ్‌మెంట్‌పై ప్రధాన రాజకీయ పార్టీలు దృష్టి సారిస్తున్నాయి. నోటిఫికేషన్ వచ్చిన తరువాత సరిహద్దులో తనిఖీలు మరింత ముమ్మరమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే గ్రామాలు, డివిజన్లలో ఆయా సామాజిక వర్గాల్లో ప్రభావం చూపించగలిగిన వారిని వివిధ రూపాల్లో ఆకట్టుకుంటున్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే ఈసారి మీకే ప్రాధాన్యమిస్తాం.. గతంలో జరిగిన కొన్ని పొరపాట్లను పట్టించుకోవద్దు అంటూ ఇప్పటికే అధికార పార్టీ వారు బుజ్జగింపు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఇప్పటికే ద్వితీయ శ్రేణి నేతల, అసంతృప్తి వాదులకు డబ్బుతో ఎర వేస్తున్నారు. ఇతర పార్టీలకు చెందిన వారు తమ పార్టీలోకి వస్తే ఇంత.. ఎన్నికల సహరిస్తే ఇంత అని నేతలను కొనుగోలుకు కొన్ని నియోజక వర్గాల్లో ఇప్పటికే అభ్యర్థులు తెరదీశారు. టిక్కెట్లు రాని వారు అసంతృప్తిగా ఉండగా టిక్కెట్లు వచ్చిన వారు అసంతృప్తి వాదులను బుజ్జగించేందుకు వివిధ రూపాల్లో బేరసారాలు, అంతర్గత చర్చలు జరుగుతున్నాయి.



నేడు పల్నాడు జిల్లాకు సిఎం బస్సుయాత్ర

- నూజెండ్ల మండలం చింతలచెరువు వద్ద ప్రవేశం
- గంటావారిపాలెంలో బస, ఇక్కడే ఉగాది వేడుకలు
- రూట్ మ్యాప్‌లోని ప్రాంతాలను పరిశీలించిన ఎస్పీ

ప్రజాశక్తి - వినుకొండ

వైసిపి అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర 11వ రోజైన సోమవారం వినుకొండ నియోజకవర్గం ద్వారా పల్నాడు జిల్లాలోకి ప్రవేశించనుంది. ప్రకాశం జిల్లా దర్శి మండలం వెంకటాచలంపల్లి వద్ద నుండి సోమవారం ఉదయం బస్సు యాత్ర ప్రారంభం అవుతుంది. కురిచేడు మీదగా వినుకొండ నియోజకవర్గంలోని నూజెండ్ల మండలం చింతలచెరువు గ్రామం వద్ద బస్సు యాత్ర పల్నాడు జిల్లాలోని ప్రవేశిస్తుంది. అయినవోలు నుండి చీకటిగలపాలెం అడ్డరోడ్డు వద్దకు చేరుకుంటుంది. అక్కడ భోజన విరామం అనంతరం బస్సు యాత్ర సాయంత్రం 3:30



రూట్ మ్యాప్‌పై పోలీసు అధికారులు, సిబ్బందికి వివరిస్తున్న పల్నాడు జిల్లా ఎస్పీ బిందుమాధవ్

గంటలకు వినుకొండ పట్టణం చేరుకుంటుంది. విఠంరాజుపల్లి మీదగా శావల్యాపురం మండలం కనుమర్లపూడి, శావల్యాపురం, కృష్ణాపురం, గంటవారిపాలెం వద్దకు రాత్రికి చేరుకుంటుంది. రాత్రి

▶ 2లో



వెల్తూవెల్తూ శ్రేణులకు అభివాదం చేస్తున్న చంద్రబాబు

ముగిసిన చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ఎన్నికల ప్రచారంలో భాగంగా టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన ప్రజాగళం పేరుతో పల్నాడు జిల్లాకు వచ్చిన విషయం తెలిసిందే. శనివారం సత్తెనపల్లిలోని ఓ కళ్యాణ మండపంలో బస చేసిన చంద్రబాబు టిడిపి ముఖ్యనాయకులు, అసమ్మతి నేతలతో ఆదివారం సమావేశమయ్యారు. నియోజకవర్గాల వారీగా చర్చించి దిశానిర్దేశం చేసిన అనంతరం సాయంత్రం 4 గంటలకు సత్తెనపల్లి ఆర్సీఎం స్కూల్లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకుని హెలికాప్టర్ ద్వారా వెళ్లిపోయారు. ఆయనకు టిడిపి జిల్లా అధ్యక్షులు జీవి ఆంజనేయులు, సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, నాయకులు ఎం.శివనాగమల్లేశ్వరావు వీడ్కోలు పలికారు.

తెలంగాణ కంటే వెనుకబాటులో ఏపీ అభివృద్ధి

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య



ప్రజాశక్తి-తాడేపల్లి

తెలంగాణ కంటే ఆంధ్రప్రదేశ్ అభివృ ద్ధిలో పూర్తిగా వెనకబడిపోయిందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య అన్నారు. తాడేపల్లిలోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశ రాజకీయాల్లో ప్రస్తుతం జరిగిన ఎన్నికలను అసాధారణ ఎన్నికలతో పోల్చారు. ఈ ఎన్నికల్లో బిజెపి, ఎన్‌డిఎ మిత్ర పక్షాలను ప్రజలు చిత్తుగా ఓడిస్తారన్నారు. కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, ఆప్ వంటి పార్టీలు బలపరిచిన ఇండియా బ్లాక్ మంగళగిరి నియోజకవర్గ అభ్యర్థి జొన్న శివశంకరరావు, పార్లమెంటు అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్‌లను గెలిపించాలని కోరారు. రాజధానిని ముక్కలు చేస్తుంటే ఇది తప్పు అని జగన్‌కు మోడీ చెప్పలేకపోయాడని విమర్శించారు. పార్లమెంట్లో రాజధాని చట్టం చేసిన 12 అంశాలు అమలు జరిగితే ప్రతి సంవత్సరం రూ.రెండున్నర లక్షల కోట్ల ఆదాయం సమకూరే దన్నారు. ఈ రకంగా రూ.25 లక్షల కోట్లు ఆంధ్రప్రదేశ్ నష్టపోయిం దన్నారు. రాష్ట్ర హక్కుల కోసం ఢిల్లీలో పోరాటం చేయలేని జగన్ చంద్రబాబులను నమ్మి మోసపోవద్దని ప్రజల్ని కోరారు. ప్రత్యేక హోదా దగ్గర నుంచి అభివృద్ధి వైపు పయనించాలంటే ఇండియా ఫోరం అభ్యర్థులను గెలిపించాలని కోరారు.



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమవారం సాయంత్రం) : 6.27
సహరీ (మంగళవారం ఉదయం) : 4.40



నీళ్ల కోసం నోళ్లు తెరిచిన చెరువులు

ప్రజాశక్తి - రెంటచింతల

నీరు లేక మండల కేంద్రమైన రెంటచింతలలోని నజీరుద్దీన్ చెరువు బీటలు వారింది. మండలంలోని పలు గ్రామాల్లోనూ దాదాపు గతంలో సాగర్ జలాలను మూడుసార్లు విడుదల చేసినా ఈ చెరువురు సరిగా నీరందలేదు. గొట్టిముక్కల మేజర్ నుండి కాల్వల ద్వారా నజీరుద్దీన్ చెరువుకు నీరు అందాల్సి ఉన్నా రహదార్ల నిర్మాణం, విస్తరణ పనుల నేపథ్యంలో ఆ కాల్వ మార్గాలను పూడ్చేశారు. ఈ కారణంగా చెరువకు నీరందగా ప్రజలు తాగునీటి కోసం నానా అగచాట్లు పడుతున్నారు. కొన్నిరోజులుగా ఇక్కడి(పజలకు ట్యాకర్ల నీరే గతి అవుతోంది. తాజాగా సోమవారం సాగర్ నుండి విడుదలయ్యే నీటితోనైనా చెరువును నింపాలని, అప్పుడే ఈ వేసవి నుండి గట్టెకుతామని స్థానికులు కోరుతున్నారు. ఈ చెరువు నిండితే భూగర్భ జలాల మట్టమూ పెరిగి బోర్ల ద్వారా నీరొస్తుంది.

జిజిహెచ్‌లో పేదలకు ఆధునిక వైద్యం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి లో ఆధునిక వైద్యం పేద ప్రజలకు అందుతుందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ చెప్పారు. ఆదివారం శుశ్రుత హాలులో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జరిగిన సమావేశం లో అయన మాట్లాడారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది 'నా ఆరోగ్యం .నా హక్కు' నినాదాన్ని తీసుకుందన్నారు. ఈ నినాదాన్ని ముగ్గురికి చేరవేయాలని ఆ ముగ్గురు మరో ముగ్గురికి సమాచారం అందించాలని సూచించారు. ప్రభుత్వాలు మానవుని ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని, దేశ రక్షణ కోసం కేటాయించిన బడ్జెట్ ప్రజల



ఆరోగ్యం కోసం కూడా బడ్జెట్ అధికంగా కేటాయించాలని సూచించారు. ఆవిధంగా బడ్జెట్ కేటాయించినపుడు పేద ప్రజలకు ఆధునిక వైద్యం అందుతుందని ఆయన చెప్పారు. కులాలకు మతాలకు ప్రాంతాల వారీగా బాషా ల తో సంబంధం లేకుండా ఉన్నప్పుడే ఉచితంగా వైద్యం అందుతుందన్నారు. మానవుని మనుగడకు సైన్స్ ఆధారమని అభిప్రాయపడ్డారు. సాంఘిక దురాచారాలు, మంత్రాలు, తంత్రాలు వంటి పని చేయవని అన్నారు. మనిషిని బతికించేది సైన్స్ అన్న విషయాన్నీ ప్రతి ఒక్కరు గమనించాలని, కోవిడ్ సమయం లో ఆధునిక వైద్యం ఏవిధంగా ప్రజలకు సేవలు అందాయో తెలుసుకోవాలని గుర్తు చేశారు. జిల్లా న్యాయ సేవాధికారిక సంస్థ కార్యదర్శి , సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి మాట్లాడుతూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా జీవించేందుకు అవకాశాలు ఉంటాయని అన్నారు. ఆధునిక వైద్యం అందుబాటులో ఉన్నా కొవిడ్ బారిన పడి అనేకమంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు చూశామని గుర్తు చేశారు. నాట్కో సమన్వయ కర్త వై అశోక్ కుమార్ మాట్లాడుతూ రోగులకు సహదయంతో నర్సులు వైద్య సేవలు అందించాలని సూచించారు. క్యాన్సర్ ఆసుపత్రి కి నన్నపనేని విసి అందించిన సహకారం మరువలేమని అన్నారు. నర్సింగ్ వృత్తి ఎంతో పవిత్రమైందని, ఇబ్బందుల్లో ఉన్న రోగులకు వైద్యం అందించడం నర్సింగ్ బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ గంగమ్మ, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కట్టా కాళిదాసు, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



గుంటూరు తూర్పు అభివృద్ధి చెందాలంటే టిడిపి వల్లే సాధ్యం : నసీర్ అహ్మద్

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరు తూర్పు నియోజకవర్గం 17 వార్డ్ హుడా రోడ్ కమ్మ శేషయ్య గ్రౌండ్ లో వైసిపికి చెందిన, ఎం.శీను (వాటర్ ప్లాంట్), మణికంఠ, పవన్, అంజి, మోహన్, రఫీ, ఖాజా, సంజయ్,30 కుటుంబాలు ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరాయి. వారందరికీ గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మొహమ్మద్ నశీర్ కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే కూటమి పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, తన వల్లే సాధ్యమని అన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరూ రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని ప్రజల్లో తీసుకెళ్లి టిడిపి ప్రభుత్వం వల్ల జరిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. గత పదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం వల్ల మనకు జరిగిన అభివద్ధి ఏమో గాని గుట్కా గంజాయి ఏరులై పారిందన్నారు. వైసీపీ ఎమ్మెల్యే ముస్తఫా హయాంలో గుంటూరు తూర్పు నియోజకవర్గం గుట్కా, మత్తు పదార్థాలకు, గంజాయి కి కేంద్ర గా మార్చేశారని విమర్శించారు. కార్యక్రమంలో వార్డ్ అధ్యక్షులు పెమ్మసాని శీను, సెక్రటరీ దొడ్డి నాగరాజు, బీసీ అధ్యక్షులు మురళి, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



ముస్లిముల అభ్యున్నతికి కూటమి కట్టుబడి పనిచేస్తుంది : మనోహర్, చంద్రశేఖర్

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక బోస్ రోడ్డులోని నూకల రామకోటేశ్వరరావు కళ్యాణ మండపంలో ముస్లింలు పెద్ద ఎత్తున నిర్వహించిన ఇఫ్తార్ విందులో టిడిపి, జనసేన, బిజెపి కూటమి గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి నియోజకవర్గ అభ్యర్థి నాదెండ్ల మనోహర్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ రంజాన్ వేడుకలు ఎంతో పవిత్రమైనవని, సాధ్యమైనంత ఎక్కువమంది ముస్లింలను ఈ సందర్భంగా కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ముస్లింల సంక్షేమానికి కూటమి కట్టుబడి ఉంటుందన్నారు. ఆలపాటి రాజా మాట్లాడుతూ ముస్లింలు హజ్ యాత్రకు వెళ్ళడానికి, వర్క్ఫ్ బోర్డుల ఆస్తులు కాపాడడానికి, వారి ఆర్థిక సామాజిక అభివృద్ధికి టిడిపి ఎంతగానో కృషి చేసిందన్నారు. మున్ముందు కూటమి కూడా అదే ధ్యేయంతో పని చేస్తుందన్నారు. మనోహర్ మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధికి, వారి స్వేచ్ఛకి భంగం కలగకుండా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అనంతరం ఇఫ్తార్ విందును ప్రారంభించారు.

ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

ప్రజాశక్తి-తాడేపల్లి

ప్రజలు మార్పు కోరుకుంటున్నారని జై భీమ్ పార్టీ వ్యవస్థాపకులు, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి జడ శ్రావణ్‌కుమార్ అన్నారు. తాడేపల్లి ప్రకాశం బ్యారేజ్ నుంచి మంగళగిరి వరకు ఆయన తన ప్రచార కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మురుగుడు లావణ్యకు కనీసం నియోజకవర్గ హద్దులు కూడా తెలియవని, ఇక లోకేష్‌కు ఓటేస్తే ఎవరికీ అందుబాటులో ఉండరని అన్నారు.



ఆర్యవైశ్యుల సమస్యల పరిష్కరిస్తాం : మంత్రి రజని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సమాజంలో సంపద సృష్టించేది ఆర్యవైశ్యులేనని, వారి సమస్యలు పరిష్కారం కోసం తాను ముందుంటానని గుంటూరు పశ్చిమ నియోజకవర్గం వైసిపి అభ్యర్థి, మంత్రి విడదల రజని తెలిపారు. గుంటూరు విద్యానగర్‌లోని ఒక హోటల్‌లో ఆదివారం ఆర్యవైశ్యులతో ఆమె ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వైసిపిలో ఆర్యవైశ్యులకు తగిన గుర్తింపు ఉందని తెలిపారు. తొలి సారిగా వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేశామన్నారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ప్రసంగిస్తూ సిఎం జగన్ అన్ని తరగతుల వారికి తగిన న్యాయం చేస్తున్నారని అన్నారు. ఆర్యవైశ్యులకు తగిన ప్రాధాన్యత ఇచ్చారన్నారు. టిడిపి కన్నా ఎక్కువ సీట్లు కేటాయిస్తున్నట్టు తెలిపారు.వైసిపి గుంటూరు లోక్‌సభ అభ్యర్థి కిలారు రోశయ్య, ఎమ్మెల్యే మద్దాలి గిరి, వైసిపి జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్యవరప్రసాద్,డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు,రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షులు పానుగంటి చైతన్య ,చాంబర్ ఆఫ్ కామెర్స్ అధ్యక్షులు ఆతుకూరి ఆంజనేయులు,గుడిపాటి భాస్కర్,దేవరశెట్టి చిన్ని,టి.యల్.వి వీరంజనేయులు,మట్టుపల్లి మోహన్, పొట్టి శ్రీరాములు,సాధు ప్రసాద్,బిజినేపల్లి శరత్,మెడ సాంబశివరావు,ఆత్మకూరు నాగేశ్వరరావు ప్రసంగించారు.

మహానాడులో వైసిపి ప్రచారం

ప్రజాశక్తి-తాడేపల్లి



తాడేపల్లి మహానాడు ఒకటో రోడ్డు నుండి వైసిపి గుంటూరు పార్లమెంటు అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, మంగళగిరి నియోజకవర్గ అభ్యర్థి మురుగుడు లావణ్య విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఈ ఐదేళ్ల కాలంలో అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, పట్టణ జెసిఎస్ కన్వీనర్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డి, శివాలయం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ చిన్నపోతుల దుర్గారావు, సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వేమారెడ్డి, గుంటూరు జిల్లా జెసిఎస్ కన్వీనర్ ఈదులుమూడి డేవిడ్ రాజు, అప్పిగట్ల సంపూర్ణ పార్వతి, కళ్లం రాజశేఖర్‌రెడ్డి, మేకా వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజన్‌తో మంగళగిరి అభివృద్ధికి పాటుపడతా : లోకేష్



ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి అభివృద్ధిపై తనకు విజన్ ఉందని, ఎమ్మెల్యేగా గెలిచాక అహర్నిశలు కష్టపడి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటానని, రాబోయే ఎన్నికల్లో తనను ఎంత ఎక్కువ మెజారిటీతో గెలిపిస్తే అంతబలంగా పోరాడి మంగళగిరి అభివృద్ధికి నిధులు తెస్తానని టిడిపి యువనేత నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి నియోజకవర్గం కప్పురావు కాలనీ, శ్రీశైలంనగర్‌లో ఆదివారం రాత్రి నిర్వహించిన రచ్చబండ సభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... గత ఎన్నికల్లో నేను 5350 ఓట్ల తేడాతో ఓడిపోయాను. అయినా మంగళగిరి పట్టణం, రూరల్ లో తనకు మెజారిటీ ఇచ్చారని చెప్పారు. ఓటమి తనలో కసి, పట్టుదల పెంచిందని, సొంత నిధులతో 29 సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసినట్లు చెప్పారు. 25 సంవత్సరాలు ప్రాతినిధ్యం వహించిన మురుగుడు కుటుంబం కానీ, ఆర్కే గానీ నియోజకవర్గంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం అయినా చేశారా? అని ప్రశ్నించారు. రాజధాని విషయంలో ఆర్కే మంగళగిరికి వెన్నుపోటు పొడిచారని, అమరావతి రాజధానికి జగన్ ను ఒప్పిస్తానని చెప్పి అసెంబ్లీలో 3రాజధానులకు ఓటేశారని అన్నారు. ఆత్మకూరు, ఇప్పటం గ్రామాల్లో రోడ్డు విస్తరణ పేరుతో అర్థరాత్రివేళ బుల్డోజర్లతో భయభ్రాంతులను చేసి పేదల ఇళ్లు కూల్చేశారని అన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను లోకేష్ దృష్టికి తెచ్చారు.



శివారు కాలనీల అభివృద్ధికి కృషి : గల్లా మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో ప్రధాన రహదారులతో పాటు శివారు ప్రాంతాల్లో సమస్యలను కూడా పరిష్కరిస్తామని టిడిపి పశ్చిమ నియోజకవర్గం అభ్యర్థి గల్లా మాధవి పేర్కొన్నారు. ఆదివారం రాత్రి ఆమె 25వ డివిజన్‌లో పర్యటించారు. గుంటూరు గత కొనేళ్లుగా అభివృద్ధిలో వెనుకబడి ఉందన్నారు.టిడిపి అధికారంలోకి రాగానే శివారు ప్రాంతాలల్లో నెలకొన్న సమస్యలపై ఒక కార్యచరణ రూపొందించి మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. టిడిపి నాయకులు కోవెలమూడి రవీంద్ర, జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్‌తో కలసి ఆమె ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాధవి మాట్లాడుతూ.. ప్రజలకు కావాల్సిన కనీస సదుపాయలు రోడ్లు, డ్రైనేజి వ్యవస్థను అధికార పార్టీ నాయకులు నిర్లక్ష్యం చేశారని అన్నారు. అధికార పార్టీ నాయకుల మాటలు కోటలు దాటుతున్నాయి తప్ప, అభివృద్ధి అనేది భూతద్దం వేసి వెతికిన కూడా కనిపించటం లేదని విమర్శించారు.

వైసిపి నుండి100 కుటుంబాలు జనసేనలోకి

ప్రజాశక్తి-తాడికొండ

రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి జనసేన పార్టీ కృషి చేస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు అన్నారు తాడికొండ శివారు బడేపురంలో ఆదివారం జనసేన పార్టీ నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. నేటి సమాజంలో డబ్బు రాజకీయాలు పోవాలని ,విలువలు కలిగిన రాజకీయ నాయకులను ఎన్నుకోవాలని అన్నారు. వైసీపీకి చెందిన 100 కుటుంబాలు జనసేన పార్టీలో చేరాయి..గాదె వెంకటేశ్వరరావు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టిడిపి మాజీ శాసనసభ్యులు తెనాలి శ్రావణ్ కుమార్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్, జిల్లా సమన్వయకర్త బేతపూడి విజయ్ శేఖర్ ,పార్టీ మండల అధ్యక్షులు గులకవరపు నరేష్ ,పార్టీ నాయకులు బి .జ్యోతి, కాలిశెట్టి మోహన్ రావు ,కాలిశెట్టి రంగారావు ,తాయి క్రాంతి కిరణ్, ప్రశాంత్ ,రాజీవ్ పాల్గొన్నారు .



40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి- పెదనందిపాడు రూరల్

ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న మినీ లారీని ఆదివారం ఉదయం పెదనందిపాడు ఎస్ఐ టి.రాజశేఖర్ తన సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. మండలంలోని పాలపర్రు డీలర్ రమేష్ కు చెందిన రేషన్ బియ్యం 40 క్వింటాల్ (80 బస్తాలు) మినీ లారీలో ఆదివారం వేకువ జామున రాజుపాలెం మీదుగా అన్నపర్రు అడ్డదారి నుండి గుంటూరు తరలిస్తున్న సమాచారం తెలుసుకున్న పెదనందిపాడు ఎస్ఐ అన్నపర్రు అడ్డదారిలో రేషన్ బియ్యం లోడుతో వస్తున్న మినీ లారీని అడ్డుకొని స్వాధీనం చేసుకుని డ్రైవర్ శ్రీనివాసరావు ను అదుపులోకి తీసుకున్నారు.

అనంతరం విషయాన్ని తహాశీల్దార్ దృష్టికి తీసుకెళ్లి వారి ఆదేశాల మేరకు సివిల్ సప్లయర్స్ డిటి పద్మజకు అందజేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం లారీతో పోలీసు అధికారులు

మహిళపై దాడి

ప్రజాశక్తి-నాదెండ్ల

మహిళపై రాడ్డుతో దాడి చేసి గాయపరిచిన సంఘటన మండలంలోని చందవరం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది.నాదెండ్ల ఎస్సై బలరాం రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన గొంటు రామ సుబ్బమ్మ, తన ఇంటి వద్ద ఉండగా తన తమ్ముడు అయిన చెరెడ్డి హనిమిరెడ్డి వచ్చి తనకు కుడా పొలంలో బాగం ఉంది అని, అది ఇవ్వక పోతే తన అంతు చూస్తానంటూ, ఇనుప రాడ్ తీసుకొని రామసుబ్బమ్మ ఎడమ చేతి పై కొట్టాడు. మణికట్టు వద్ద రక్త గాయం కావడంతో సుస్మిత హాస్పిటల్‌లో చేర్చారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-తెనాలి

పట్టణ త్రీ టౌన్ పోలీసులు ఆదివారం పేకాటరాయుళ్ళను అరెస్ట్ చేశారు. వారు వెల్లడించిన వివరాల ప్రకారం పట్టణంలోని తూర్పు కాలువ వంతెనదిగువన పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ 8,300 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

15 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉండి తాగునీరివ్వలేకపోయారు

ప్రజాశక్తి-మాచర్ల



మాట్లాడుతున ముప్పాళ్ళ నాగేశ్వరరావు

స్థానిక శాసనసభ్యులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ముఖ్య మంత్రి జగన్ మోహన్‌రెడ్డికి మంచి సాన్నిహిత్యం వుందని, అయినా ఈ ప్రాంతం అభివృద్ధి చేసుకోలేక పోయారని, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి కనీసం మాచర్ల పట్టణానికి తాగునీరు ఇవ్వలేకపోయారని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు విమర్శించారు. ఆదివారం స్థానిక స్థానిక సిపిఐ కొమెర వీర స్వామి భవనంలో మాచర్ల నియోజకవర్గం జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముప్పాళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ పల్నాడు మెరకప్రాంత రైతుల కష్టాలు తీరాలంటే వరికపూడిసెల ఎత్తిపోతుల పథకం పూర్తి కావాలన్నారు. పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాదరావు, సహాయ కార్యదర్శులు షేక్ హుస్సేన్, కాసారాంబాబు, ఏరియా సెక్రటరీ మేకపోతుల శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు.

105 కుటుంబాలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-వినుకొండ

బొల్లాపల్లి మండలం గంగపల్లి, పలుకూరు, రామాపురం, సోమలవాగు తండా, వెల్లటూరు నుంచి ఆదివారం వైసీపీని వీడి టిడిపిలో పెద్దఎత్తున చేరికలు జరిగాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, వర్గాలనుండి మొత్తం 105 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశంలో చేరాయి. వెల్లటూరు నుంచి 40 కుటుంబాలు, సోమలవాగు తండా నుంచి 30 కుటుంబాలు, గంగపల్లి నుంచి 20 కుటుంబాలు, పలుకూరు, రామాపురం నుంచి 15 కుటుంబాలు తెలుగుదేశంలో చేరాయి. పలుకూరు సర్పంచ్ యలగాల బాలయ్య కూడా టిడిపిలో చేరారు. పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, వినుకొండ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు సమక్షంలో వీరు వినుకొండలోని పార్టీ కార్యాలయంలో పార్టీ కండువాలు కప్పుకొన్నారు. అనంతరం జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ఐదేళ్లుగా పల్నాడు ప్రాంతాన్ని ఎండబెట్టి, ఇక్కడ ప్రాజెక్టుల్ని గాలికొదిలేసి, ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదన్నారు. ముఖ్యమంత్రి జగన్, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు నిర్వాకాల వల్లనే వైసిపి నాయకులు ప్రజలకు సమాధానం చెప్పుకోలేని దుస్థితిలో పడ్డారన్నారు.

అరవిందబాబును నమ్మే స్థితిలో ప్రజలు లేరు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైసిపి కార్యకర్తలను ప్రలోభాలకు గురి చేసి రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్న నరసరావుపేట ఉమ్మడి కూటమి అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబును నమ్మే స్థితిలో నరసరావుపేట నియోజకవర్గ ప్రజలు లేరని రానున్న ఎన్నికల్లో నరసరావుపేటలో హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. నరసరావుపేటలోని క్రిష్టియన్ పాలెంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ద్వారా పొందిన లబ్దిని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు గురించి వివరించారు. క్రిష్టియన్ పాలెంకు చెందిన 50 కుటుంబాల ప్రజలు వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి నాయకులు కల్లబొల్లి మాటలతో, మోస పూరిత హామీలతో మోస పోవద్దన్నారు. వాలంటీర్లు పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలను లబ్ధిదారుల ఇళ్ల వద్దకే తెచ్చి ఇస్తుంటే ఓర్వలేక కుట్రలుపన్ని అడ్డుకున్నారని మండిపడ్డారు. కూటమిని ఓడించి బుద్ధి చెప్పాలన్నారు.



ఎమ్మెల్యే సమక్షంలో వైసిపిలో చేరిన క్రిష్టియన్‌పాలెంకు చెందిన కుటుంబాల వారు

ప్రజాశక్తి-విజయపురి సౌత్

మాచర్ల మండల పరిధిలోని అచ్చమ్మకుంట గ్రామానికి చెందిన 30 టిడిపి కుటుంబాలు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైసిపిలో చేరాయి. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్పిటిసి మల్లుస్వామి, వైసిపి నాయకులు బూడిద శ్రీనివాసరావు, పోతిరెడ్డి కోటిరెడ్డి, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు బ్రహ్మం నాయక్, రంగా నాయక్, బూడిద సైదులు, మధ్య నాయక్, సాయి, బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై టిడిపి ఆర్యవైశ్యుల ఆరోపణల్లో వాస్తవం లేదు

పుడా చైర్మన్ మిట్టపల్లి రమేష్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేటలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఆర్యవైశ్యులు వైసిపిపై, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డిపై చేసిన ఆరోపణలలో వాస్తవం లేదని, ఖండిస్తున్నట్టు పుడా చైర్మన్ మిట్టపల్లి రమేష్ చెప్పారు. ఆదివారం నరసరావుపేటలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమేష్ మాట్లాడుతూ ఐపిలు పెట్టిన వారి దగ్గర చందాలు వసూలు చేశామని చెప్పడంలో వాస్తవం లేదని అన్నారు. నరసరావుపేటలో ఏ ఆర్యవైశ్యునికి కష్టం వచ్చినా పార్టీలకతీతంగా ఎమ్మెల్యే అండగా ఉన్నారన్నారు. ఆర్యవైశ్యులు ప్రశాంత వాతావరణంలో తమ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకుంటున్నారని తెలిపారు. ఇళ్ళు లేని నిరుపేద ఆర్యవైశ్యులకు చదువుకుంటున్న ఆర్యవైశ్య పిల్లలకు పార్టీలకతీతంగా నవరత్నాలలో పథకాలు అందాయన్నారు. రానున్న ఎన్నికల్లో నరసరావుపేటలో ఓటమి భయంతో ఎమ్మెల్యేపై బురద జల్లేందుకు స్థానిక టిడిపి ఆర్యవైశ్యులు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రావులపాలెం ప్రజాగళం సభలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు ముమ్మాటికీ ఆర్యవైశ్యులను అవమానించేలా ఉన్నాయన్నారు.



మాట్లాడుతున్న ఆర్యవైశ్య టిడిపి నాయకులు

'వైసిపి.. కుల రాజకీయాలు తగదు'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు రావులపాలెం సభలో గంజాయి కిరాణా దుకాణాలలో దొరుకుతుందని మాట్లాడిన మాటలను వక్రీకరించిన వైసిపి.. ఆర్యవైశ్యులకు ఆపాదిస్తూ కుల రాజకీయాలు చేస్తున్నారని టిడిపి ఆర్యవైశ్య నాయకులు మండిపడ్డారు. నరసరావుపేట నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి అత్తులూరి సుబ్బారావు మాట్లాడుతూ నరసరావుపేటలో ఐపీలు పెట్టిన ఆర్యవైశ్యులకు, రూ.150 కోట్లు టోపీలు పెట్టిన వారిని రక్షిస్తూ ఎమ్మెల్యేతో కలిసి కమిషన్లు దండుకుంటున్న ఆర్యవైశ్య నాయకులకు కులాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయం చేయడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్యవైశ్య నేత రోశయ్య విగ్రహానికి ఐపిలు పెట్టిన వారి దగ్గర బలవంతంగా విరాళాలు తీసుకున్న మాట వాస్తవం కాదా అని నిలదీశారు. వైసిపి 5 ఏళ్ల పాలనలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటయ్యాక కార్పొరేషన్ నుంచి ఒక్క రూపాయి కూడా ఆర్యవైశ్యుల సంక్షేమం కోసం ఖర్చు చేయలేదన్నారు. ఒంగోలులో సుబ్బారావు గుప్తను, తెనాలిలో ఆర్యవైశ్యులను మోకాళ్ళ మీద కూర్చోబెట్టి వైసిపి నాయకుల తీరును ఖండించని ఆర్యవైశ్యులు రాజకీయాలు కోసం విమర్శలు చేయడం తగదన్నారు. మాజీ కౌన్సిలర్లు గట్టుపల్లి సత్యనారాయణ, కొత్తూరు హనుమంతరావు,రాష్ట్ర కార్యదర్శి వనమా శివ,అత్తులూరి సాంబశివరావు, వనమా పవన్, మాజేటి పుల్లారావు,కొత్తూరి సుబ్బరాయుడు, కాకుమాను వెంకట్రావ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుల నివాళి

ప్రజాశక్తి-విజయపురి సౌత్

మాచర్ల మండలం జమ్మలమడకకుచెందిన టిడిపి నాయకులు కూరాకుల నాగేశ్వరరావు తల్లి ఆదివారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో నాగేశ్వరరావును కాపు జేఏసి నియోజకవర్గ అధ్యక్షుడు పసుపులేటి బ్రహ్మానాయుడు, గుండాల శ్రీనివాస్ యాదవ్, వజ్రాల శ్రీనివాసరెడ్డి నివాళులర్పించారు. పార్టీ అండగా ఉంటుందని వారు తెలిపారు.

జగన్ లాంటి స్లిక్కర్ల సిఎంని చరిత్రలో చూడలేదు : జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి-వినుకొండ

జగన్‌రెడ్డి లాంటి స్టిక్కర్ల సిఎంంని రాష్ట్ర చరిత్రలోనే చూడలేదని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు జీవీ ఆంజనేయులు ఎద్దేవా చేశారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు అందించిన పథకాలకు పేర్లు మార్చడం, కేంద్ర ప్రభుత్వం పథకాలపై స్టిక్కర్లు వేసుకోవడం మినహా ప్రజల కోసం జగన్ కొత్తగా చేసిందేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 2.70లక్షల కోట్ల ప్రజలకు ప్రత్యక్ష నగదు బదిలీ చేశామని ప్రచారం చేసుకుంటున్న జగన్, అందులో సగం డబ్బు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిందేనన్న నిజాన్ని ఎందుకు వెల్లడించడం లేదని దుయ్యబట్టారు. జగన్ ప్రభుత్వం నవరత్నాల ప్రచారాలపై ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పలు ప్రశ్నలూ సంధించారు ఆంజనేయులు. రాష్ట్రంలో నేటికీ 89 లక్షల రేషన్ కార్డులకు సరుకులు ఇస్తోంది కేంద్ర ప్రభుత్వమో కాదో చెప్పాలన్నారు. పేదలకు పంపిణీ చేయమని కేంద్రం ఇచ్చిన 5.65 లక్షల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని బొక్కేసిన దొంగలు ఎవరో నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం ప్రభుత్వహయాంలో రేషన్ దుకాణాల ద్వారా 8 రకాల సరకులు అందిస్తే జగన్ వచ్చాక వాటిని బియ్యానికే పరిమితం చేయడం నిజం కాదా... అన్న క్యాంటీన్లు రద్దు చేసి పేదల కడుపులు మార్చడం వాస్తవం కాదా.. జగన్ ఎన్నికల ప్రచారంలో వీటికి కూడా జవాబులు ఇవ్వాలన్నారు. అన్నదాతలకు రైతుభరోసా ద్వారా 13 వేల 500 ఇస్తున్నట్లు బిల్డప్ కొడుతున్న జగన్ అందులో కేంద్రం వాటా రూ. 6వేల సంగతిని ఎందుకు ప్రస్తావించడం లేదని నిలదీశారు జీవీ. జల్ జీవన్ మిషన్ వంటి పథకాల్ని ఉయోగించుకోకుండా రాష్ట్రాన్ని దాహం కేకలకు వదిలేశారని దుయ్యబట్టారు.

అయిదేళ్లలో చేసిన 12 లక్షల కోట్లలో సంక్షేమానికి ఇచ్చిన 1.35 లక్షల కోట్లు పోగా మిగిలిన డబ్బంతా ఎవరి జేబుల్లోకి వెళ్లింది? 94 వరకు ఉన్న కేంద్ర పథకాల్లో 70 స్కీమ్‌లకు రాష్ట్రవాట ఇవ్వకుండా వాటిని ఎందుకు నిరుపయోగంగా మార్చారు? అనే అంశాలపై కూడా జగన్ ప్రజలకు వివరిస్తే మేలన్నారు. ఇవేకాక జగన్ కంటే చంద్రబాబు హయాంలోనే ఎక్కువ సంక్షేమ అందిందని స్పష్టం చేశారు జీవీ. ఉదాహరణకు చంద్రబాబు 16లక్షలమందికి ఫీజు రియంబర్స్‌మెంట్ ఇస్తే దానిని 9 లక్షలమందికి కుదించిన ఘనుడు జగన్ అని చురకలు వేశారు. చంద్రబాబు హయాంలో రూ. 5 లక్షల వరకు డ్వాక్రా మహిళలు సున్నా వడ్డీ రుణాలిస్తే దానిని రూ. 3లక్షలకే పరిమితం చేసిన వ్యక్తి కూడా ప్రజలకు తెలియజేయలన్నారు జీవీ. రైతు రుణమాఫీ, అన్నక్యాంటీన్లు, నిరుద్యోగ భృతి, 100 కుపైగా సంక్షేమ పథ కాలు రద్దు చేసిన జగన్‌రెడ్డికి మళ్లీ ప్రజల్ని ఓటడిగే అర్హతే లేదని అన్నారు.

IN THE HONOURABLE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISION). CHEEPUIRUPALLI O.S.NO.21/2023

Between
SUNKARI TIRUMALA RAO & 2 OTHERS.
......PLAINTIFFS
And
THOTA HANUMANTA RAO....DEFENDANT
To
Thota Hanumantha Rao, S/o. Sidhaiah, Hindu, aged about 37 years, R/o. Pulipadu Village, Gurajala Mandal and Guntur District.

GENERAL NOTICE

Please take Notice that the above named Plaintiffs filed a suit against you for the grant of Injunction and so also an application under order XXXIX Rule 1 & 2 of C.P.C. vide I.A.No. 93/2023 in O.S.No. 21/2023 to not interfere in to the peaceful possession and enjoyment of the plaint schedule property. That the Honorable Court several times issue summons to you, but you wantonly escaped from the service of the same.

That the above suit and I.A. is posted for hearing at **10-30 AM. on 18/04/2024** before the above said Court and if you want to contest the matter you may do so either in person or by a duly instructed pleader and if you fail to show casue matter will be decided in your absence and expert.

(By order of the Honourable Court)

Majji Narasinga Rao,
Advocate.
Teacher's Colony, Garividi,
Cell No. 77803 34987

క్యాంపస్ డ్రైవ్ లో న్యూటన్స్ విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-విజయపురిసౌత్

మాచర్ల మండలం అలుగురాజుపల్లి సమీపంలోని న్యూటన్స్ కళాశాలలో చెన్నైకు చెందిన టీవీఎస్ సుందరం ఫాస్ట్నర్స్ కంపెనీ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించింది.. ఈ డ్రైవ్ లో కళాశాలకు చెందిన 23 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రెటరీ జున్న శ్రీనివాసరెడ్డి తెలిపారు. తమ కళాశాలలో ఇప్పటికే పలు సాఫ్ట్వేర్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారని, ఆయా డ్రైవ్‌లలో తమ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. డ్రైవ్ లో ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జగదీశ్వర్ రెడ్డి, టిపిఓ రామ్మోహన్ రెడ్డి, పలు హెచ్ఓడిఎస్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.




కన్నా లక్ష్మీనారాయణకు వినతిపత్రం ఇస్తున్న చిత్రం

కాంపౌండర్ల సమస్యలు పరిష్కరిస్తా

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

కాంపౌండర్స్ నర్సెస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానికంగా ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ కాంపౌండర్ల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కాంపౌండర్లు వినతిపత్రం అందజేశారు.



రాజకీయ ప్రాధాన్యం కల్పించడంలో విఫలం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మైదాన ప్రాంతాల్లో ఉన్న గిరిజనులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించడంలో రాజకీయ పార్టీలు విఫలమయ్యారని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి. శ్రీను నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎన్నార్టీ సెంటర్లోని సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న గిరిజనులకు రాజకీయంగా అవకాశాలు కల్పిస్తున్న ప్పు డు మైదాన ప్రాంతాల్లో ఉన్న గిరిజనులకు ఎందుకు అవకాశం కల్పించ లేకపోతున్నారన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో గిరిజను లకు అవకాశం కల్పించ లేకపోతు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కంటితుడుపుగా అవకాశాలు కల్పిం చి రాజకీయంగా గిరిజనులను తొక్కే స్తున్నారని అన్నారు. గిరిజన గ్రామీణ ప్రాంతాలను పంచా యతీలుగా గుర్తించారు కానీ, రెవిన్యూ పరంగా గుర్తించలేకపోతున్నారన్నారు. ఈ విషయమై పలు రాజకీయ పార్టీల నేతలు ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని, ఎన్నికలు జరగనున్న తరుణంలో మైదాన ప్రాంతాల్లో ఉన్నటువంటి ఉపాధ్యాయులు, మేధావులు, విద్యార్థులు యువకులు విష యాల పై పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆదర్శ కమ్యూనిస్టు బగ్గి వెంకటేశ్వర్లు

సంతాప సభలో నాయకులు.. అంత్యక్రియలు పూర్తి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

క్రమశిక్షణ కలిగిన కమ్యూనిస్టు కార్యకర్తగా, తన తుదిశ్వాస విడిచే వరకూ సిపిఎం నాయకునిగా, రైతు సంఘం మండల అధ్యక్షులుగా బగ్గి వెంకటేశ్వర్లు పని చేస్తూ పార్టీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య కొనియాడారు. పాముకాటుకు గురై మరణించిన బగ్గి వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని సిపిఎం నాయకులు, రైతు సంఘం నాయకులు ఆదివారం సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కందులువారిపాలెంలో సంతాప సభ నిర్వహించారు.సిపిఎం సత్తనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ సిపిఎం ఆధ్వర్యంలో కందులవారిపాలంలో, సత్తెనపల్లి మండలంలో, జిల్లాలో ఇళ్ల పట్టాల కోసం, వృద్ధాప్య పెన్షన్ కోసం, మంచినీటి కోసం, కరెంటు కోసం వంటి అనేక పోరాటాల్లో వెంకటేశ్వర్లు పాల్గొన్న విషయాన్ని గుర్తు చేశారు. కమ్యూనిస్టు పార్టీ సైనికుడిగా ఎర్ర చొక్కా ధరించి, ఎర్రజెండా పట్టుకొని ముందు వరసలో నిలబడి అన్ని వర్గాల ప్రజలతో ఆయన కలిసిమెలిసి జీవించేవారని అన్నారు. వెంకటేశ్వర్లు జీవితం ఎంతో ఆదర్శనీయమని, ఢిల్లీ మహానగరంలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతులు చేసిన ఆందోళనలో ఆరు రోజులు పాటు ఆయన పాల్గొన్నారని అన్నారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ మాట్లాడుతూ వెంకటేశ్వర్లు ఉత్తమ కమ్యూనిస్టుగా ఆయన చేసిన కషి, మరిచిపోలేనిదని కొనియాడారు. సత్తెనపల్లి మండలంలో ఎర్రజెండా రెపరెపలాడటానికి ముఖ్య భూమిక పోషించిన కృషీవలుడు అని కొనియాడారు పార్టీ మహాసభలు జరిగిన సందర్భాల్లో ప్రముఖ పాత్ర పోషించి అందరినీ కలుపుకొని జన సమీకరణ చేసి జయప్రదం చేయడంలో ఆయన పాత్రను ప్రశంసించారు.



అంత్యక్రియల్లో పాల్గొన్న సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు



బగ్గి వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న కృష్ణయ్య, గద్దె చలమయ్య

ఈ సందర్భంగా ప్రజా నాట్యమండలి నాయకులు దుగ్గి నాగేశ్వర రావు, కోట నాయక్ పలు గేయాలను ఆలపించారు. సంతాప సభలో కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గుంటుపల్లి బాలకృష్ణ, ఏపూరి గోపాలరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గంజిమాల రవి బాబు, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజిని, రాష్ట్ర కమిటీ సభ్యులు గద్దె ఉమశ్రీ, సిపిఎం సత్తెనపల్లి పట్టణ కార్యదర్శి ధరణికోట విమల, పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు గుంటూరు మల్లేశ్వరి సిఐటియు నాయకులు షేక్ సిలార్, ఎం.హరిపోతురాజు, చేనేత కార్మిక సంఘం నాయకులు కట్ట శివ దుర్గారావు , అనుముల వీరబ్రహ్మం, యువజన సంఘం నాయకులు జడ రాజ్ కుమార్ రైతు సంఘం మండల కార్యదర్శి ఎం .నరసింహారావు పార్టీ మండల కమిటీ సభ్యులు దుగ్గి మేరమ్మ, ఫణిదం శాఖ కార్యదర్శి వంగర తులసీరామ్, కమిటీ సభ్యులు రావూరి పూర్ణచంద్రరావు, భగత్ విద్యార్థి సంఘం నాయకులు అమూల్య కందుల వారి పాలెం గ్రామ శాఖ కార్యదర్శి చలువది లక్ష్మీనారాయణ, గ్రామ పార్టీ నాయకులు వెంకటనారాయణ, సత్యవతి , వెంకయ్య, సాయిబా పాల్గొన్నారు.

ఆత్మీయతను పెంపొందించేందుకు పండుగలు

ప్రజాశక్తి - వినుకొండ

టెక్నాలజీ మనుషుల్ని దూరం చేస్తే సంప్రదాయం మనసుల్ని కలుపుతుందని, మనుషుల మధ్య ఆత్మీ యతలు పెరగడానికి పండుగలు అని, ఈ సందర్భంగా చేసే ఉత్సవాలు దోహదం చేస్తాయని విను కొండ మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి అన్నారు. రోటరీ క్లబ్ అఫ్ గ్రేటర్ వినుకొండ, కళాసాగరి సాంస్కృతిక సంస్థ సంయుక్తంగా ఆదివారం నిర్వ హించిన శ్రీ క్రోధి నామ ఉగాది ఉత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సంద ర్భంగా జరిగిన సభకు రోటరీ అధ్యక్షులు చిరుమామిళ్ల కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. రోటరీ జిల్లా 3150 అసిస్టెంట్ గవర్నర్ ఆలా శ్రీనివాసరావు గౌరవ అతిథిగా పాల్గొన్నారు - పంచాంగం శ్రవణం తో పాటు కవి సమ్మేళనం నిర్వహించారు. కమిటీ వారు కవులను ఘనంగా సత్కరించారు. సభలో వివిధ రంగాలలో కృషి చేసిన వినుకొండ ప్రాంత ప్రముఖులకు ఉగాది పురస్కారాలు ప్రధానం చేసి సత్కరించారు. కామేశ్వరి (సంగీతం), డాక్టర్ మన్నెం సాంబశివరావు (వైద్య రంగం) , డాక్టర్ వహీదా (వైద్య విద్య), బి.వి నాగేశ్వరరావు (విద్యారంగం), గంగినేని రాఘవరావు (సేవా రంగం), యార్లగడ్డ చంద్రశేఖర ఆజాద్ (జర్న లిజం), ముత్తినేని గిరిబాబు (కళా రంగం), కొత్త వెంకారెడ్డి (వ్యవసాయ రంగం), ఎంపి నరసింహారావు దంపతులు (సీనియర్ సిటిజన్స్), వి. స్వాతి (జాతీయ అవార్డు గ్రహీత) , ప్రతిమ సునీల్ (శాస్త్రీయ నృత్యం) లు పుంస్కారాలు అందుకున్న వారిలో ఉన్నారు . కార్యక్రమంలో కవులు కరిముల్లా , కేజే రమేష్ , కమలారామ్ , రేవతి , స్టార్ వలి తోపాటు రోటరీ కార్య దర్శి గుత్తా గురునాధం, ట్రెజరర్ నాయబ్ రసూల్ , రోటరీ సభ్యులు శ్రీనివాసరావు , కరీముల్లా మాస్టర్ కళాసాగరి సభ్యులు సదాశివరావు , కోటి తదిరులు పాల్గొన్నారు. కళాసాగరి అధ్యక్షులు కూచి రామాంజ నేయులు సభ నిర్వహణ,కార్యక్రమాలను పర్యవేక్షించారు. చిరంజీవులు మోక్షశ్రీ , హర్షిణిల నృత్యాలు ఆకట్టుకున్నాయి



రోటరీ క్లబ్ అఫ్ గ్రేటర్ వినుకొండ, కళాసాగరి సాంస్కృతిక సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఉగాది ఉత్సవంలో సన్మానం పొందుతున్న ప్రముఖులు

ప్రజాశక్తి-మాచర్ల

ఉగాది..అందరి పండగని, తెలుగు వారి పండగని ప్రముఖ కవి, రచయిత చంద్రమౌళి రామనాథశర్మ అన్నారు. వాసవి క్లబ్ ఆఫ్ మాచర్ల, రామ కృష్ణసేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కోదండరామాలయంలో క్రోధి నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనం జరిగింది. కవి నరసింహారావు ప్రారంభ గీతంతో సభ ప్రారంభమైంది. డాక్టర్ బెజ్జంకి జగన్నాథాచార్యులు సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఇటీవల పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం నుండి కీర్తి పురస్కారం పొందిన చంద్రమౌళి రామనాథశర్మ మాట్లాడుతూ ఉగాది పండుగ అనేది హిందువులు మాత్రమే చేసుకునే పండుగ కాదని, అన్ని మతాల వారు చేసుకునే ఉండుగని ముఖ్యంగా మనతెలుగువారి పండుగని అన్నారు. ఈ పండుగ ఆయా ప్రాంతాల్లో వసంత కాలంలో తమిళ ఉగాదని, కన్నడ ఉగాది అని జరుపుకుంటారన్నారు.

పండుగనాడు ఉగాది పచ్చడిని ప్రసాదంగా స్వీకరిస్తామని, అది ఒక ఔషదమని తెలిపారు. కవి సమ్మే ళనంలో డాక్టర్ కమల్‌హాసన్, షేక్ సాయిబాబా, ముప్ప వరపు గాంధి, సంధ్యాబాయి, మాజీ డిప్యూటీ డిఇఒ గాదె రామ కృష్ణారావు, పోలి రెడ్డి, కుర్రి సాయి మార్కొండారెడ్డి, పెద్దోజు భవాని ప్రసాద్, గురజాల అప్పారావు, సూరా కృష్ణవేణి, గురజాల అప్పారావు, శేషబ్రహ్మాచారి, చెన్నుపల్లి రాంబాబు, చిన్ని రంగారావు, పావులూరి సతీష్ బాబులు తమ కవితలు, ఉపాన్యాసాలు ఇచ్చారు. అనంతరం వాసవి క్లబ్ ఆఫ్ మాచర్ల అధ్యక్షులు ఓరుగంటి చెన్నకేశవరావు శాలువాలతో వీరిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, చుండూరి సత్య నారాయణ, సిహెచ్ నాగేశ్వరరావు, పి. పిచ్చయ్య పాల్గొన్నారు.



మాచర్లలో కీర్త పురస్కార గ్రహీత చంద్రమౌళి రామనాథశర్మను సన్మానిస్తున్న చిత్రం


మంగళగిరిలో మాట్లాడుతున్న గుంటూరు ఎంపీ అభ్యర్థి జంగాల అజయ్‌కుమార్


తాడేపల్లిలో మాట్లాడుతున్న మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి జొన్నా శివశంకరరావు

కార్పొరేట్, మతోన్మాద బిజెపిని ఓడించాలి

పోరాటాలకు అండగా నిలిచే, సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించే వామపక్ష అభ్యర్థులను గెలిపించాలి

పలుచోట్ల సిపిఎం, సిపిఐ, కార్మిక సంఘాల సమావేశాల్లో నాయకుల పిలుపు

ప్రజాశక్తి - మంగళగిరి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కార్పొరేట్ మతోన్మాద బిజెపిని ఓడించాలని గుంటూరు పార్లమెంటు స్థానానికి ఇండియా ఫోరం తరుపున సిపిఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జంగాల అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశానికి సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య అధ్యక్షత వహించారు. అజయ్ కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను, పెట్రోల్ ధరలను భారీగా పెంచిందన్నారు. దేశవ్యాప్తంగా బిజెపికి ఎదురుగాలి వీస్తోందని, అయితే మతాల పేరుతో దేశ ప్రజలను విభజించి రానున్న ఎన్నికల్లో మళ్లీ లబ్ధి పొందాలని చూస్తోందని విమర్శించారు. మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం ఇండియా బ్లాక్ అభ్యర్థి జొన్న శివశంకర్ మాట్లాడుతూ మంగళగిరి నియోజక వర్గంలో కమ్యూనిస్టులు అనేక పోరాటాలు ప్రజా సమస్యలను పరిష్కరించారని అన్నారు. వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు రాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపి పార్టీకి తొత్తులుగా ఉన్నాయని, ఆ పార్టీలన్నింటినీ ఓడించాలన్నారు. సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, సిపిఐ నియోజవర్గ కార్యదర్శి చిన్ని తిరుప తయ్య, సిపిఎం నాయకులు డి.వెంకట్‌రెడ్డి, పి.బాలకృష్ణ, సిపిఐ నాయకులు కె.మాల్యాద్రి, ఎ.అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ శాసనసభ, పార్లమెంట్‌కు కమ్యూనిస్టులను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవడానికి కార్మికవర్గం కృషి చేయాలని సిఐటియు జిల్లా నాయకులు ఎస్ఎస్ చెంగయ్య కోరారు. ఎయిమ్స్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ విస్తృత సమావేశం స్థానిక సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. చెంగయ్య మాట్లాడుతూ కార్మికవర్గం పోరాటాలకు అండగా ఉండే, కార్మిక హక్కులు, ప్రజా సమస్యలపై చట్ట సభల్లో పోరాడే కమ్యూనిస్టులను ఎన్నుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుండి 'ఇండియా' ఫోరం తరుపున సిపిఎం అభ్యర్థి జొన్న శివశంకర్, గుంటూరు ఎంపీ స్థానానికి సిపిఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జంగాల అజయ్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. మతోన్మాద బీజేపీని, దానితో జతకట్టిన పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. యూనియన్ కార్యదర్శి కె.రమేష్ మాట్లాడుతూ పోరాడే అభ్యర్థులకు కార్మికుల అండ ఉంటుందన్నారు. జొన్న శివశంకర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కావాలంటే కమ్యూనిస్టులను ఎన్నుకోవాలన్నారు. సిఐటియు నాయకులు జి.నాగరాజు, పి.శివశంకర్‌రావు, పి.శేఖర్‌బాబు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్ : సిపిఐ ఆధ్వర్యంలో పొన్నూరు పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో నాయకులు ఆరేటి రామారావు ఆధ్యక్షతన సమావేశం నిర్వహించారు. జంగాల అజయ్ కుమార్‌తోపాటు ఇండియా ఫోరం తరుపున కాంగ్రెస్ అభ్యర్థిగా పొన్నూరు అసెంబ్లీ స్థానానికి పోటీ చేస్తున్న జక్కా రవీంద్రనాథ్ పాల్గొన్నారు. జంగాల అజయ్ మాట్లాడుతూ మోడీ రూపంలో ప్రజాస్వామ్యానికి ప్రమాదం పొంచి ఉందన్నారు. మోడీ ఓటమితోనే సామాన్యులకు మనుగడని చెప్పారు. రవీంద్రనాథ్ మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికలు దేశపు రెండవ స్వాతంత్ర్య సంగ్రామ స్ఫూర్తితో జరుగుతున్నాయని అన్నారు. నియంతత్వ ప్రభుత్వాల మనుగడ మనుషుల ఉనికికి ప్రమాదమన్నారు. సిపిఐ నాయకులు పి.సత్యనారాయణ, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు సిహెచ్.రవిబాబు, టి.సాంబయ్య, రైతు నాయకులు కె.రంగారెడ్డి, ఎ.అరుణ్ కుమార్, ఎం.హనుమంతరావు, డి.శ్రీను పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తాడేపల్లి : ఎమ్మెల్యేగా జొన్నా శివశంకరావు, గుంటూరు ఎంపీగా జంగాల అజయ్‌కుమార్‌ను సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.సూర్యారావు కోరారు. తాడేపల్లి ముగ్గురోడ్డు చర్చి సమీపంలో లక్ష్మయ్య కొట్టు వద్ద జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా చోట్ల జరిగిన సమావేశాలకు స్థానిక శాఖ కార్యదర్శి డి.విజయబాబు అధ్యక్షత వహించారు. సూర్యారావు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందంటే సిపిఎం వల్లనేనని చెప్పారు. పేదలపై దాడులు, దౌర్జన్యాలు నిలువరించడంలో కమ్యూనిస్టుల కృషి ఉందన్నారు. కేంద్రంలోని మోడీ అధికారంలోకి వస్తే మరోసారి ఎన్నికలు ఉండవని ఆందోళన వ్యక్తం చేశారు. తమ స్వార్ధ ప్రయోజనాల కోసం వైసిపి, టిడిపి, జనసేన బిజెపికి మద్దతు పలుకుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వామపక్ష అభ్యర్థులను గెలిపించడం ద్వారా ఈ ప్రాంత ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. సమావేశాల్లో వై.శ్రీనివాసరావు, కె.మేరి, ఫిరోజ్ పాల్గొన్నారు.

ప్రకాష్‌నగర్ సిఐటియు కార్యాలయంలో ఇపిఎస్ పెన్షనర్స్ సమావేశం జరిగింది. పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు కొల్లిపర బాబుప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 1.20 కోట్ల మంది పెన్షనర్స్‌ను నమ్మించి మోసం చేసిందని చెప్పారు. కనీస పెన్షన్ నెలకు రూ.3500 ఇస్తామని 2014 ఎన్నికలకు ముందు వాగ్దానం చేశారని, 2019 ఎన్నికల్లో రూ.5 వేలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. నేటికీ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని విమర్శించారు. రిటైర్ అయిన కార్మికులకు ఆశ పెట్టి మోసం చేసిందని, అలాంటి బిజెపి, దానితో పొత్తు పెట్టుకున్న పార్టీలను దూరంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. కనీస పెన్షన్ నెలకు రూ.10 వేలు అమలు చేయాలని, వైద్య సౌకర్యం అమలు చేయాలని కోరారు. ఏసీసీ కార్మికుల నష్టపరిహారం కోసం పోరాడుతున్న సిపిఐటియు, సిపిఎంలకు మద్దతుగా నిలవాలని కోరారు. సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకర్‌రావును గెలిపించాలన్నారు. సిఐటియు జిల్లా నాయకులు వి.దుర్గారావు, ఏసీసీ కార్మిక సంఘం నాయకులు స్టీఫెన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్ : మోడీ అధికారంలోకి వస్తే సంవత్సరానికి కోటి ఉద్యోగాలు ఇస్తామని నమ్మ బలికిన నరేంద్ర మోడీ మాటలు నీటి మూటలుగా మారాయని, బిజెపి పరిపాలనలో నిరుద్యోగం దేశంలోనే రెట్టింపు అయిందని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య అన్నారు. ఆదివారం రాత్రి ప్రాతూరులో సిపిఎం విస్తృత సమావేశం డి.రాజేంద్రబాబు అధ్యక్షతన జరిగింది. కృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల అన్నింటిని ప్రైవేటుపరం చేస్తున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు కల్పించకుండా దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టారని మండిపడ్డారు. కార్మిక చట్టాలను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చారని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడ్డాక రాజ్యాంగానికి ముప్పు వాటిలిందని అన్నారు. మతోన్మాద శక్తి నుండి దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. బిజెపిని గద్దె దించడమే కాకుండా దానితో జగకట్టిన టిడిపి, జనసేన పార్టీలను, నిరంకుశ వైఖరి అవలంబిస్తున్న వైసిపిని ఓడించాలన్నారు. రానున్న ఎన్నికలలో ఇండియా ఫోరం అభ్యర్థులును గెలిపించాలని కోరారు. ఇండియా ఫోరం తరుపున సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి అయిన జొన్న శివశంకరరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని, రైతులను నిర్వీర్యం చేసే మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చిన బిజెపిని రైతులందరూ వ్యతిరేకిస్తున్నారని అన్నారు. దేశవ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు మోడీ విధానాలను వ్యతిరేకించాలని ఆయన అన్నారు. సిఐటియు జిల్లా నాయకులు బి.ముత్యాలరావు మాట్లాడుతూ మోడీ విధానాలను తూచా తప్పకుండా పాటిస్తున్న వైసిపి ప్రభుత్వం కార్మికులపై ఉక్కు పాదం మోపిందన్నారు. మున్సిపల్ ఉద్యోగులు, అంగన్వాడి, ఆశా వర్కర్ల సమస్యలను విస్మరించారన్నారు. సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి డి.వెంకటరెడ్డి, నాయరకులు పి.కృష్ణ, బి.రాజు, బి.నాగిరెడ్డి, డి.సురేష్, పి.సుబ్బారావు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో టి10 క్రికెట్ టోర్నీ ప్రారంభం

ప్రజాశక్తి-దుగ్గిరాల

దేహ దారుఢ్యానికి మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని దోస్త్ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు జాగర్లమూడి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రమైన దుగ్గిరాలలోని కెఆర్ఎం డిగ్రీ కళాశాల క్రీడాస్థలంలో ఆదివారం దోస్త్ సంస్థ సహకారంతో ఫ్రెండ్స్ లెవెన్ నిర్వహిస్తున్న టి10 క్రికెట్ టోర్నమెంట్‌ను శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో ఇటువంటి టోర్నమెంట్లు నిర్వహించటం సంతోషకరమని, క్రీడా స్ఫూర్తితో యువకులు ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. 30వ తేదీ వరకు ఈ టోర్నమెంట్ ఉంటుందని, ప్రతిరోజు ఉదయం 8 నుండి 11 గంటల వరకు సాయంత్రం మూడు నుండి ఐదు గంటల వరకు పోటీలు జరుగుతాయని చెప్పారు. ఇప్పటివరకు 35 జట్లు నమోదు చేసుకన్నాయని తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి



రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు ప్రదానం చేస్తామని వివరించారు. కార్యక్రమంలో దోస్త్ అధ్యక్షులు ఎం.గాంధీ, సభ్యులు గద్దె శ్రీనివాస్, గూడూరు వెంకటరావు, ఫ్రెండ్స్11 సభ్యులు సుబ్రహ్మణ్యం కోటినాగు పాల్గొన్నారు.



లాకులకు కొత్త తలుపులు ఏర్పాటు

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్థానిక పాతలాకులకు కాలం చెల్లిన తలుపులను తొలగించి వాటి స్థానంలో కొత్త తలుపులు తయారు చేస్తున్నారు. దుగ్గిరాల నుండి నిజాంపట్నం పడవల కాల్వకు గతేడాది కొత్త తలుపులు మంజూరైనా కాల్వకు నీరు వదలడం వలన పూర్తికాలేదు. బకింగ్ హామ్ కాల్వ నుండి ప్రారంభమవుతున్న ఈ కాల్వ తలుపులు ప్రధాన కాల్వ నుండి వచ్చే నీటి ఒత్తిడిని తట్టుకోవాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఒక్క పని కూడా మంజూరుకాకున్నా ఈ తలుపులకు ఉన్న ప్రాముఖ్యతను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు.

'బాలశౌరి గన్‌తో బెదిరించి బీ ఫారాలు లాక్కున్నారు'

ప్రజాశక్తి - మంగళగిరి

మచిలీపట్నం ఎంపీ, తాజా ఎన్నికల్లో టిడిపి, జనసేన, బిజెపి కూటమి తరుపున జనసేన అభ్యర్థిగా పోటీ చేస్తున్న వల్లభనేని బాలశౌరి తమను తుపాకితో బెదిరించి బీ ఫారాలు తీసుకున్నారని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డి.నాగేశ్వరావు ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బాలశౌరి విజయవాడలోని హోటల్ ఐలాపురం వద్దకు మాట్లాడాలని శుక్రవారం రాత్రి పిలిచారని, వెళ్లిన తమను గన్‌తో బెదిరించి 10 'బి' ఫారంలు తీసుకువెళ్లారని, వీటిల్లో రెండు ఎంపీ, 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించినవని అన్నారు. తమ పార్టీ ఎన్నికల గుర్తు బకెట్ వచ్చిందని, దీనివలన జనసేనకు నష్టం కలుగుతుందనే దురుద్దేశంతో బెదిరిస్తున్నారని అన్నారు. బెదిరిస్తే బెదిరిపోయేవాళ్లం కాదని అన్నారు. దీనిపై తాము విజయవాడ గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్లో, డీజీపీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. దీనిపై ఎన్నికల కమిషన్ కూడా స్పందించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు, జి.రామారావు, షేక్ బాషా, షేక్ మస్తాన్, ఎస్డి సయ్యద్, ఎస్.కె గబ్బర్ పాల్గొన్నారు.

మురుగు తీసి ఎన్నాళ్లో...

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి ముగ్గురోడ్డు మసీదు సమీపంలో డ్రెయినేజీల్లో పూడిక తీసి నెలల తరబడి అవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు పెద్దఎత్తున చెత్త కాలువలోకి చేరడంతో మురుగునీరు పారుదల నిలిచిపోయింది. ఫలితంగా దుర్వాసన వెదజల్లుతుందని , దీని వల్ల అంటువ్యాధులు ప్రబలుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వెంటనే స్పందించి మురుగు కాలవల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి నీటి పారుదల సక్రమంగా జరిగేలా చూడాలని స్థానిక సిపిఎం నాయకులు విజయబాబు, ఫిరోజ్ కోరారు.





'హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్' మెగా ఉచిత వైద్యశిబిరాలు

ప్రజాశక్తి - వినుకొండ

ముత్తూట్ ఎం జార్జ్ ఫౌండేషన్ సౌజన్యంతో ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ ఆధ్వర్యంలో వినుకొండలోని మారుమూల ప్రాంతాలు మసీదుమాన్యం, డ్రైవర్స్ కాలనీ, అంబేద్కర్ కాలనీల్లో గత మూడురోజులుగా నిర్వహిస్తున్న ఉచిత మెగా వైద్య శిబిరాలకు అన్ని వర్గాల ప్రజల నుండి అనూహ్య స్పందన లభించింది. దాదాపు రెండు వేల రూపాయల ఖరీదయ్యే గుండె,లివర్, కిడ్నీ, షుగర్, బిసి వంటి వ్యాధుల నిర్ధారణ పరీక్షలను ఇప్పటివరకు ఈ కాలనీలోని 287 మందికి ఉచితంగా నిర్వహించారు. అందుకు సంబంధించిన రిపోర్ట్స్ ను వారికి అందజేశారు. తమ గ్రామాలకు వచ్చి విలువైన వైద్య పరీక్షలను నిర్వహించడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భగా 'హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్' సంస్థను పలువురు ప్రముఖులు,పెద్దలు అభినందించారు. ఈ మూడురోజులపాటు నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాలకు ముతూట్ ఏం జార్జ్ వైద్యబృందం, వినుకొండ హాండ్స్ ఆఫ్ కంపాషన్ కోఆర్డినేటర్ విద్యారావ్, వాలంటీర్ కమ్ టీచర్స్ ఆశా, షాహీద, సంధ్య, కొండలు, సంస్థ క్షేత్రస్థాయి అవగాహన సిబ్బంది జక్రయ, రాజు, రహమత్, విజయ పాల్గొన్నారు.

కాపు, బలిజ సంక్షేమ సేన అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఏకగ్రీవం

ప్రజాశక్తి-వినుకొండ

వినుకొండ నియోజకవర్గం కాపు, బలిజ సంక్షేమ సేన అధ్యక్షుడిగా యాదాల వెంకటేష్‌ను, ఉపాధ్యక్షుడిగా నారిశెట్టి మహేష్‌ను ఏక గ్రీవంగా ఎన్నుకుని నియమించినట్టు ఉమ్మడి గుంటూరు జిల్లా కాపు,బలిజ సంక్షేమ సేన అధ్యక్షుడు శ్యాం ప్రసాద్ తెలిపారు. కాపు, బలిజ సంక్షేమ సేన ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు శ్యాంప్రసాద్ అధ్యక్షతన గుంటూరులో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఈ ఎన్నిక జరిగింది. పట్టణానికి చెందిన కాపు బలిజ సంఘం నాయకులు ఈ సందర్భంగా వెంకటేష్, మహేష్‌కు అభినందనలు తెలిపారు



కూరగాయల మార్కెట్ నూతన అధ్యక్షునికి సన్మానం

ప్రజాశక్తి- వినుకొండ

నియోజకవర్గ కూరగాయల మార్కెట్ నూతన అధ్యక్షులుగా ఇటీవల ఎన్నికైన సుంకర శ్రీనివాసరావును వినుకొండ నియో జక వర్గం కాపు సంఘం నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. స్థానిక మా లక్ష్మమ్మ చెట్టు వద్ద ఉన్న సుంకర శ్రీనివాసరావు కార్యాలయంలో జరిగిన అభినందన సభలో శ్రీనివాసరావుని మర్యాద పూర్వకంగా కలిశారు. తొలుత దుశ్శాలువాతో సన్మానించారు. కేక్ కట్ చేయించారు. రానున్న రోజుల్లో మరిన్ని పదవులు చేపట్టాలని ఆకాం క్షించారు. కూరగాయల మార్కెట్ అభివృద్ధి, ముఠా కార్మికుల సంఘానికి సహాయం చేస్తామని ఈ సందర్భంగా శ్రీని వాసరావు చెప్పారు. కార్యక్రమంలో ఎస్.బ్రహ్మం, ఎస్. ప్రసాద్, జి.పెద్దన్న, రామారావు, కె.రామ్మోహన్, ఎస్.శ్రీని వాసరావు, ఎ.రాములు, పి.వెంకటేశ్వర్లు, కె.రాంబాబు, ఎస్. నాగేశ్వరరావు, బి.ప్రసన్న, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'మేము సిద్ధం' బస్సు యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-వినుకొండ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

ఆపధర్మ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టిన మేము సిద్ధం బస్సుయాత్ర సోమవారం వినుకొండకు చేరనుందని, నియోజకవర్గంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు రావాలని చేయాలని ఎమ్మెల్సి లేళ్ల అప్పిరెడ్డి, వినుకొండ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి కోరారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 'మేము సిద్ధం' బస్సు యాత్ర ప్రకాశం జిల్లా కురిచేడు నుండి పల్నాడు జిల్లాలోని ప్రవేశించనుందని చెప్పారు. మొదట నూజెండ్ల మండలం చింతలచెరువు నుండి సోమవారం సాయంత్రం 3:30 గంటలకు వినుకొండకు చేరుతుందని,స్థానిక శివయ్య స్తూపం మీదుగా శావల్యపురం మండలం గంట్టవారిపాలెం వద్దకు చేరుతుందని తెలిపారు. 175 కు 175 స్థానాల్లో వైసిపి విజయం సాధించేందుకు ఒక ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళుతోందన్నారు. వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గంలో వైసిపి శ్రేణుల మధ్య కొంత అసంతృప్తి ఉందని, గ్రామాల్లో గ్రూపు రాజకీయాలు నడవడం సహజమని, అయితే, వైసిపి శ్రేణులు సమన్వయం పాటించి ఐక్యంగా ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ఆర్యవైశ్యుల ఆర్థిక ఎదుగుదలను అణిచివేసిన వైసిపి : టిడిపి

ప్రజాశక్తి - నరసరావుపేట

నరసరావుపేట పట్టణంలోని పలు అపార్టుమెంట్ వాసులతో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో టిడిపి,జనసేన,బిజెపి ఉమ్మడి ఎంపి,ఎమ్మెల్యే అభ్యర్థులు లావు శ్రీకృష్ణదేవరాయలు,డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు. వైసిపిఅధికారంలోకి వచ్చాక ఆర్యవైశ్యులను ఆర్థిక,సామాజిక, రాజకీయంగా అణిచివేచారని అరవింద బాబు ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి అధికారంలోకి రాగానే అపార్టుమెంట్ వాసులు తెలిపిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఆర్యవైశ్యులు మాట్లాడుతూ ఆర్యవైశ్యులంతా కలిసికట్టుగా పని చేసి అరవింద బాబు గెలుపునకు దోహదపడాలన్నారు. నరసరావుపేటలో ఆర్యవైశ్యులు కడుపు కట్టుకొని సంపాదించిన డబ్బులను, బిడ్డల భవిష్యత్తు కోసం దాచుకున్న ఆర్యవైశ్యుల సొమ్ము కాజేసి ఐపిఎలు పెట్టిన వారికి ఎమ్మెల్యే కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేకి ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ వత్తాసు పలుకుతున్నారన్నారు. కమిషన్లకు కక్కుర్తిపడ్డ ఎమ్మెల్యే, ఆర్యవైశ్యుల జీవితాలను రోడ్డు మీదకి లాగారని అన్నారు. ఆర్యవైశు కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ ఎన్.సుబ్బరాయ గుప్త, రాష్ట్ర బులియన్ మార్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.విజయ్‌కుమార్, నరసరావుపేట బిజెపి కన్వీనర్ ఆర్. రామకృష్ణ, టిడిపి నాయకులు వి.సింహాద్రి యాదవ్, వి.శివ, ఎ.చిన్న వెంకట్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు జి.సత్యనారాయణ,కె. హనుమంతరావు,ఎ.సుబ్బారావు పాల్గొన్నారు.



ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న లావు శ్రీకృష్ణదేవరాయలు,చదలవాడ అరవింద బాబు

టిడిపి లోకి చేరికలు

సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి అనుచరునిగా వ్యవహరించిన బులియన్ మార్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు శనివారం పెదకూరపాడు నియోజకవర్గంలో జరిగిన ప్రజాగళం సభలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సమక్షంలో టిడిపి కండువా కప్పుకున్నారు. ఆదివారం మాజీ జడ్పిటీసీ సీతామహాలక్ష్మీ, మాజీ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మానుకొండ శ్రీనివాసరావు, రొంపిచర్ల మండలం గోగులపాడుకి చెందిన వైసిపి నాయకులు ఉయ్యాల వెంకట్రావు తమ అనుచరులతో కలసి లావు శ్రీకృష్ణ దేవరాయలు, డాక్టర్ చదలవాడ సమక్షంలో సత్తెనపల్లిలో జరుగుతున్న సమీక్ష సమావేశంలో టిడిపి కండువా కప్పుకున్నారు.

'కూటమి అధికారంలో కొస్తేనే మహిళల కష్టాలు తీరేది'

ప్రజాశక్తి - వినుకొండ

రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొంటున్న కష్టాలు తీరా లంటే తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీల కూటమి అధికారంలోకి వస్తేనే సాధ్యమని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు భార్య లీలావతి అన్నారు. శనివారం రాత్రి వినుకొండ 14వ వార్డుకు చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడి తెలుగుదేశంలో చేరారు. లీలావతి సమక్షంలో 25 కుటుంబాలు టిడిపి కండు వాలు కప్పుకున్నారు.

ప్రజాశక్తి-పెదకూరపాడు

పెదకూరపాడు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి ప్రవీణ్‌ని గెలిపించాల్సిన బాధ్యత ఉందని నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో నియోజక వర్గం నుంచి వివిధ గ్రామాలకు చెందిన వారితో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైనికుడుల పని చేయాలన్నారు. సమావేశంలో పెదకూరపాడు మండల టిడిపి అధ్యక్షులు రమేష్ పాల్గొన్నారు.

29వ వార్డులో ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి పట్టణంలోని 29వ వార్డులో జరిగిన ఇఫ్తార్ విందులో టిడిపి,జనసేన ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం రాత్రి పాల్గొన్నారు. ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.



ప్రత్తిపాటి పుల్లారావు మామ మృతి

ప్రజాశక్తి-చిలకలూరిపేట



తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపా ధ్యక్షులు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లా రావు మామ బొగ్గవరపు వీరయ్య (78) ఆదివారం ఉదయం నాలుగు గంటల సమయంలో మృతి చెందారు. స్థానిక పండరీపురంలోని పుల్లారావు ఇంట్లోనే ఆయన భార్య కూడా ఉంటున్నారు. వీరయ్యకు నలుగురు సంతానం. ఇద్దరు మగ పిల్లలు,ఇద్దరు ఆడ పిల్లలు. అందులో ప్రత్తిపాటి పుల్లారావు భార్య ప్రత్తిపాటి వెంకట కుమారి రెండో సంతానం. ఆదివారం సాయంత్రమే వీరయ్య అంతిమ యాత్ర నిర్వహించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వీరయ్య మృతిపై ముస్లిం మత పెద్దలు సంతాపం తెలిపారు. వీరయ్య భౌతికకాయాన్ని నియోజకవర్గ ప్రజలు ప్రముఖులు, ప్రజలు సందర్శించారు.

కానరాని చలివేంద్రాలు !

ప్రజాశక్తి - గురజాల

భానుడి ప్రతాపంతో ఉదయం 11 గంటల నుండి విపరీతంగా వేడి గాలుల తీవ్రత పెరిగింది. దీంతో బయటకు రావడానికి పట్టణ ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మధ్యాహ్నం అయ్యే సరికి గురజాల బస్టాండ్ సెంటర్, శ్రీరాంపురం, లక్ష్మీ టాకీస్ సెంటర్, జనసంచారం లేక నిర్మానుషంగా మారుతున్నాయి. సాయంత్రం నాలుగు గంటలైనా వేడి గాలుల తీవ్రత తగ్గకపోవడంతో.. రోజువారి కూలీలు, వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఎండలు మండుతున్నప్పటికీ సమీప గ్రామాల నుండి వివిధ పనులు నిమిత్తం మండల కేంద్రమైన గురజాలకు వచ్చి వెళ్లే వందలాదిమంది గుక్కెడు తాగునీరు లభించక అల్లాడిపోతున్నారు. గతంలో ఏప్రిల్ రాకముందే స్వచ్ఛంద సంస్థల ద్వారా చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. ఇప్పటిదాకా స్వచ్ఛంద సంస్థలు ఆ దిశగా అడుగులు వేయలేదు. స్వచ్ఛంద సంస్థలు గాని ప్రభుత్వ అధికారుల ఆధ్వ ర్యంలో గాని. గురజాలలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలి వేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



బిసి సంఘాల జెఎసి రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

నియోజకవర్గ బిసి సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం కన్నాపి సెంటర్ వద్ద గల కన్వెన్షన్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దేవుళ్ళ వెంకట్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ బిసి కులాల అభివృద్ధి, పూలే భవన్ నిర్మాణం, బిసి అభ్యర్థి, ఎంపిగా పోటీ చేస్తున్న అనిల్‌కుమార్ యాదవ్ విజయం కోసం చర్చించినట్లు చెప్పారు. దేవుళ్ళు వెంకట్ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా బిసి అభ్యర్థులను గెలిపించుకోవా లని, గత ప్రభుత్వంలో చిలకలూరిపేట లో కేటాయించిన బిసి భవన్ స్థలాన్ని ఆక్రమణదారుల నుంచి కాపాడకుందామన్నారు. బిసి భవన్ నిర్మాణానికి సంఘం తరపున తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. సమావేశానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మాదాసు పథ్విరాజ్ సాయి అధ్యక్షత వహించారు. 3,000 మందితో బిసి గర్జన సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. మహాత్మ జ్యోతిరావు పూలే సంఘం అధ్యక్షులు ఉప్పాల భాస్కరరావు, ఆంధ్రప్రదేశ్ సంచార జాతుల గౌరవాధ్యక్షురాలు తేప్పలి కాసులు ,పద్మశాలి సంఘ నాయకులు అవ్వరు అవ్వన్న ,రజక సంఘం నాయకులు బి.శివకోటి అక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసిపి మహిళా కార్యదర్శిగా చౌడేశ్వరి

ప్రజాశక్తి - రెంటచింతల

పల్నాడు జిల్లా వైసీపీ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఆదివారం నియామక పత్రాన్ని వైసిపి జిల్లా అధ్యక్షులు మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకష్ణారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అభినందించారు. మండల ప్రజాపరిషత్ అధ్యక్షు రాలుగా పనిచేశారు.

వైసిపి సీనియర్ నాయకులు గేరా సుబ్బారావు మృతి

ప్రజాశక్తి-చిలకలూరిపేట



రాష్ట్ర వైసిపి సంయుక్త కార్యదర్శి, ఎస్ఎస్‌డిజిటల్ కేబుల్ నెట్వర్క్ ఎండి, మాజీ కౌన్సిలర్ గేరాలింకన్ తమ్ముడు, వైసిపి సీనియర్ నాయకులు గేరా సుబ్బారావు (79) ఆదివారం ఉదయం రాగన్నపాలెంలోని తన స్వగృహంలో మరణించారు. ఎమ్మెల్సిమర్రి రాజశేఖర్ రాగన్నపాలెం లో సుబ్బారావు పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో ఎస్.వెంకటసుబ్బయ్య, బి.వెంకటకోటి, ఎవిఎం సుభాని, ఎస్.కోటి, జి.ఆంజనేయులు ఉన్నారు.

నత్తనడకన ఈ-హెల్త్, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణం

గడువు పూర్తయినా వేగం పుంజుకోని పనులు


ప్రజాశక్తి - తుళ్లూరు

మండల కేంద్రమైన తుళ్లూరులో ఈ-హెల్త్, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణం నత్తనడకన సాగుతోంది. నిర్ధేశిత గడువు పూర్తయినా నిర్మాణం పూర్తి కాలేదు. ఎప్పటికి పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రాజధాని ప్రాంతం కావడంతో ప్రజలకు మరిన్ని వైద్య సేవలు అందించేందుకు వీలుగా ప్రభుత్వం తుళ్లూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రం దగ్గర ఈ-హెల్త్, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణం చేపట్టింది. వ్యాధులు రాకుండా ముందుగానే ఎలా జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించడంతో పాటు వ్యాధి బారిన పడ్డాక వైద్యం అందించడం ఈ-హెల్త్, వెల్‌నెస్ సెంటర్‌లో జరుగుతుంది.



రాజధాని ప్రాంతం తుళ్లూరులో నిర్మాణంలో ఉన్న ఈ - హెల్త్, వెల్ నెస్ సెంటర్

ఈ-హెల్త్, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.కోటీ 13 లక్షల 48 వేలు కేటాయించింది. గతేడాది అక్టోబర్ 4న శంకుస్థాపన చేశారు. 310.4 చదరపు మీటర్లలో, రెండు అంతస్తులలో (జీ ప్లస్ 1) నిర్మాణం తలపెట్టారు. ఎస్ఆర్ ఎడిఫైస్ కాంట్రాక్ ఏజెన్సీకి నిర్మాణం పనులు అప్పగించారు. పనులు ఈ ఏడాది మార్చి 31 నాటికి పూర్తి కావాల్సి ఉన్నా ఇంతవరకు సగం నిర్మాణం కూడా పూర్తి కాలేదు. పనులు వేగవంతం కూడా కాకపోవడంతో ఎప్పటికి పూర్తవుతుందో అర్థం కావడం లేదు. రాజధాని ప్రాంతం కావడంతో టిడిపి ప్రభుత్వం రూ.4 కోట్లతో సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మించింది. అన్ని వసతులతో భవనం నిర్మాణం జరిగినా అవసరమైన వైద్య సిబ్బందిని మాత్రం నియమించలేదు ప్రస్తుతానికి సామాజిక ఆరోగ్య కేంద్రం (30 పడకల ఆసుపత్రి)లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నారు. ఈ-హెల్త్, వెల్‌నెస్ సెంటర్ నిర్మాణం కూడా పూర్తయితే రాజధాని ప్రాంత వాసులకు మరిన్ని వైద్య సేవలు అందించేందుకు వీలుకలుగుతుంది. కాంట్రాక్ట్ ఏజెన్సీ అలసత్వం కారణంగా నిర్మాణం నత్తనడక నడుస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు కలుగజేసుకుని పనులు త్వరగా పూర్తి చేయించి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.



మాట్లాడుతున్న బహుజన పరిరక్షణ సమితి అధ్యక్షులు గుర్నాథం

'వైసిపి మోసాన్ని రాష్ట్రమంతా చాటుతా'

మూడు రాజధానుల శిబిరం నిర్వాహకులు, బహుజన పరిరక్షణ సమితి అధ్యక్షుడు మాదిగాని గుర్నాథం

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిపై వైసిపి చేసిన మోసాలను, కుట్రలను రాష్ట్రమంతా చాటుతామని మూడు రాజధానుల శిబిరం నిర్వాహకులు, బహుజన పరిరక్షణ సమితి అధ్యక్షుడు మాదిగాని గుర్నాథం అన్నారు. రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని ఉద్యమం చేస్తున్న రైతుల్ని, మూడు రాజధానులకు మద్దతుగా నిలిచిన బహుజన పరిరక్షణ సమితి నాయకులను సిఎం జగన్మోహన్‌రెడ్డి మోసం చేసారని మండిపడ్డారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పరిపాలనా వికేంద్రీకరణతో ప్రయోజనం కలుగుతుందని నమ్మి మోసపోయామని చెప్పారు. వైసిపి మోసపూరిత వైఖరిని గ్రహించి మూడు రాజధానుల శిబిరాన్ని ఎత్తివేసి టిడిపిలో చేరానన్నారు. చంద్రబాబుతోనే రాజధాని అమరావతి, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఉద్యమం చేస్తున్న రైతులను బాధపెడితే తనను క్షమించాలని కోరారు. రాజధాని రైతులకు అండగా ఉంటానని, వారికి సంఘీభావం తెలుపుతున్నామని చెప్పారు. లోకేష్ సూచన మేరకు తుళ్లూరు వచ్చి రైతులను కలిశామన్నారు. కార్యక్రమంలో రైతు జెఎసి నాయకులు కాటా అప్పారావు, మల్లవరపు నాగయ్య, రైతులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో నేడు ఉగాది వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు సోమవారం సాయంత్రం 6 గంటలకు అరండల్‌పేట 15/1, కుబేరా టవర్స్‌లోని అవగాహన కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కవి, వాగ్గేయకారుడు, పండితుడు భూసురుపల్లి వెంకటేశ్వర్లు ఈ వేడుకలను ప్రారంభిస్తారని, ప్రముఖ నాటక రచయిత పి.వి.రామ్ కుమార్, ప్రముఖ కవి రామడుగు వెంకటేశ్వరశర్మను అవగాహన సంస్థ సభ్యులు సత్కరిస్తారని పేర్కొన్నారు. ఆధునిక కవితా గోష్ఠి, మాట-పాట కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

భాష, భావ సమన్వయమే సుందర కవిత్వం

డాక్టర్ నరసింహ దీక్షిత్

ప్రజాశక్తి-గుంటూరు



పురస్కారాలు అందుకున్న కవులు

చక్కని భాష, భావ సమన్వయమే సుందర కవిత్వం అని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ దీవి నరసింహ దీక్షిత్ అన్నారు. 'అమరావతి సాహితిమిత్రులు' ఆదివారం స్థానిక బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గజేనైషన్ సమావేశ మందిరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఉగాది కవి సమ్మేళనం, ఉగాది పురస్కారాల ప్రదాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ రావి రంగారావు అధ్యక్షత వహించిన సభలో ఆయన మాట్లాడుతూ అస్పష్ట గ్రాంథిక భాష కాకుండా అందమైన తెలుగు భాషా ప్రయోగం కవిత్వంలో అందగిస్తుందని, గొప్పగొప్ప భావాలు సముచిత సలలిత పదప్రయోగంతో విలసిల్లుతాయని ఆయన వివరించారు. ఆసక్తి ఉంటే అందరూ కవిత్వం రాయవచ్చు అనే లక్ష్యంతో అమరావతి సాహితిమిత్రులు సంస్థ నిర్వహిస్తున్న కృషిని కొనియాడారు. అంతర్జాలంలో నిర్వహిస్తున్న వారంవారం మినీ కవితల పోటీలను, వారంవారం వచన కవితల పోటీలను ఆయన స్వాగతించారు. సభలో ఎనిమిది మంది కవులకు ఉగాది కవి పురస్కారాలు అందజేశారు. డాక్టర్ గుమ్మా సాంబశివరావు, అబ్దుల్ రజా హుస్సేన్, తన్నీరు బాలాజీ, చందలూరి నారాయణరావు, చెల్లూరి సాంబమూర్తి, పూసపాటి కృష్ణ సూర్యకుమార్, డాక్టర్ సూర్యదేవర రవికుమార్, ఒంటెద్దు రామలింగారెడ్డి కవులను సంస్థ ప్రతినిధులు సత్కరించారు. సన్మాన కార్యక్రమాన్ని పాణిరావు యర్రగుంట్ల నిర్వహించారు. అనంతరం పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనంలో ఉగాది పురస్కారాలు పొందిన కవులతో పాటు కనగాల జయకుమార్, షేక్ కాసింబి, డాక్టర్ మైలవరపు లలితకుమారి, ఇడపలపాటి చంద్రయ్య, ఈవూరి వెంకటరెడ్డి, ఎం.శ్రీనివాసరెడ్డి, గడల శివప్రసాద్, ఎస్.ప్రభాకరరావు, ఎం.వి.రఘునందనరావు పాల్గొన్నారు.

హోమియో వైద్యంలో అద్భుత ఫలితాలు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో హోమియో వైద్యంపై ఆదివారం హోమియో వైద్యంపై ఆరోగ్యసభ నిర్వహించారు. సభలో సీనియర్ హోమియో వైద్యనిపుణులు డాక్టర్ కోటపాటి నాగేశ్వరరావు ప్రధాన వక్తగా పాల్గొని హోమియో వైద్యంపై అవగాహన కల్పిస్తూ ఈ వైద్యాన్ని జర్మనీలోని అలోపతిలో మాస్టర్ పట్టా పొందిన హానిమన్ ప్రపంచానికి పరిచయం చేశారని, ప్రతి సంవత్సరం ఆయన జన్మదినం ఏప్రిల్ 10వ తేదీన హోమియో వైద్యులు అందరూ పండుగగా జరుతారని వివరించారు. ఆయన అలోపతి వైద్యంలో పట్టా పొందినా హోమియోపతి దుష్పరిణామం లేని వైద్యంగా భావించి, ఆయన జీవితాన్ని త్యాగంచేసి, ఈ హోమియో వైద్యాన్ని ప్రపంచానికి అందించాలనే ఉద్దేశంతో చాలా కృషి చేశారని చెప్పారు. హోమియో వైద్యంలో తీసుకునే ఔషదం చాలా తక్కువ పవర్ ఉపయోగించడం వల్ల వ్యాధిగ్రస్తులకు దుష్పరిణామాలు లేకుండా స్వస్థత చేకూర్చడంలో సహాయపడుతుందని తెలిపారు. హోమియో వైద్యంలో వ్యాధి నయం అవటానికి ఎక్కువ సమయం పడుతుందని అపోహలు ఉన్నాయని, హోమియో వైద్యంలో కూడా త్వరిత గతిన ఉపశమనం కలిగించే పరిస్థితులు ఉన్నాయని అన్నారు. హోమియో వైద్యవిధానంలో రోగాన్ని మూలం నుంచి తెలుసుకొని దాని పూర్తి



మాట్లాడుతున్న డాక్టర్ నాగేశ్వరరావు

నిర్మూలించటానికి చికిత్స చేయటం జరుగుతుందన్నారు. తక్కువ ఖర్చుతో, సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా వైద్యం చేయగలిగే పద్ధతి అని, కొన్ని రకాల అనారోగ్య సమస్యలకు అలోపతి మంచి పరిష్కారమైనా చాలా అనారోగ్య సమస్యలకు హోమియోలో చక్కటి పరిష్కారం ఉందని చెప్పారు. హోమియో మందులు తీసుకోవటానికి అరగంట ముందు, అరగంట తర్వాత ఏమీ తీసుకోవద్దని సూచించారు. హోమియోలో చర్మవ్యాధులకు, స్త్రీ సంబంధిత వ్యాధులకు, మానసిక వ్యాధులకు ఇలా చెప్పుకుంటూ పోతే చాలా అనారోగ్య సమస్యలకు అద్భుత పరిష్కారాలు ఉన్నాయన్నారు. ఒక్క హోమియో వైద్యంలో మాత్రమే మందులను కొత్తగా కనుగొనే సమయంలో మనుషులపై ప్రయోగించే పద్ధతి ఉందన్నారు. అనంతరం డాక్టర్ నాగేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ టి.వి. సాయిరాం, అవగాహన సభ్యులు కె.చంద్రశేఖర్‌రావు, కోటేశ్వ రరావు, వేమన ట్రస్ట్ అధ్యక్ష్యులు అంజిరెడ్డి పాల్గొన్నారు.



ప్రజ్ఞాచారిని సత్కరిస్తున్న శ్రీశ్రీ కళావేదిక బృందం

శ్రీశ్రీ కళావేదిక ఉగాది వేడుకల్లో ప్రజ్ఞచారికి సత్కారం

ప్రజాశక్తి - తెనాలి

రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న క్రోధినామ సంవత్సర ఉగాది పర్వదిన వేడుకల్లో భాగంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయి సాహితి సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళా వేదిక ఆదివారం శతాధిక కవి సమ్మేళనం నిర్వహించింది. ఈ కవి సమ్మేళనంలో తెనాలి మండలం కొలకలూరుకు చెందిన సాహితీ రత్న నూతక్కి పూర్ణప్రజ్ఞాచారి పాల్గొన్నారు. 'తెలుగు తేజం' శీర్షికన అజ్ఞాచారి పద్యాన్ని రచించి, పఠనం చేశారు. ఈ సందర్భంగా నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారిని శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ ప్రతాప్, అంతర్జాతీయ సమన్వయకర్త కొల్లి రమాదేవి, చిట్టి లలిత, జాతీయ కార్యదర్శి గుండాల రాకేష్ కోనసీమ జిల్లా శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షులు బి.బి.వి. సత్యనారాయణ, నల్ల నరసింహమూర్తి పూలమాలలు, జ్ఞాపిక, ప్రశంసా పత్రంతో ప్రజ్ఞాచారిని సత్కరించారు.



భవిష్యత్ కోసం ఆలోచించి ఓటు వేయాలి

ప్రజాశక్తి-తాడేపల్లి

రాష్ట్రాభివృద్ధి కోసం ప్రజలు, యువత ఆలోచించి ఓటు వేయాలని తెలుగు యువత గుంటూరు పార్లమెంటు ఉపాధ్యక్షులు జంగాల వెంకటేష్ అన్నారు. తాడేపల్లి మణిపాల్ హాస్పిటల్ వద్ద నుండి మహానాడు కరెంట్ ఆఫీస్ వరకు ఓటు ఫర్ నారా లోకేష్, ఓటు ఫర్ పెమ్మసాని చంద్రశేఖర్ ర్యాలీ కార్యక్రమాన్ని టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. వెంకటేష్ మాట్లాడుతూ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కావాలన్నా రావాలన్నా మంగళగిరిలో నారా లోకేష్‌కు, గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఓటేయాలని కోరారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పడవల మహేష్ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు బాగుడాలంటే నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలన్నారు. ఆయనతోనే ఉపాధి అవకాశాలు మెండుగా వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో కె.వెంకటేశ్వరరావు, ఎం.శ్రీధర్‌రెడ్డి, డి.మధు, ఎ.నాగేంద్రం, జి.నాగేశ్వరరావు, డి.హరికృష్ణ, ఎస్.తేజదర్, బి.అరవింద్, షేక్ ఖాసింబాబు పాల్గొన్నారు.

అన్న సీటిచ్చాడు.. మీరు గెలిపించండి..

ప్రజాశక్తి - మంగళగిరి



ఒక్క అవకాశమిస్తే ఎకో పార్క్‌ను మరింతగా అభివృద్ధి చేస్తామని, జూ ఏర్పాటుకూ చర్యలు తీసుకుంటామని వైసిపి మంగళగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మురుడు లావణ్య చెప్పారు. ఆదివారం ఉదయం స్థానిక ఎకో పార్క్‌లో నందు పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించగా ఎంపీ అభ్యర్థి కిలారు రోశయ్య, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల తదితరులతో కలిసి లావణ్య హాజరయ్యారు. తనకు పోటీ చేసేందుకు జగనన్న అవకాశం ఇచ్చారని, గెలిచే అవకాశం మీరివ్వాలని వాకర్లను విజ్ఞప్తి చేశారు.

సామాజిక చలనాలను పసిగట్టే కాయితాల రుజువు కథల సంపుటి

ప్రజాశక్తి-గుంటూరు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వరలక్ష్మి, తదితరులు

ప్రస్తుత వ్యవస్థల, పాలక వర్గాల నిర్బంధాలను లెక్క చేయకుండా తాను నమ్మిన సిద్ధాంతాల కోసం రచనలు చేస్తున్న నల్లూరి రుక్మిణి ప్రస్ఫుటిస్తున్నాయని అరుణతార పత్రిక వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వరలక్ష్మి పేర్కొన్నారు. ప్రముఖ రచయిత్రి రుక్మిణి రచించిన 'కాయితాల రుజువు' కథా సంపుటి ఆవిష్కరణ, పరిచయ సభ ఆదివారం స్థానిక బ్రాడీపేట యుటిఎఫ్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న వరలక్ష్మి మాట్లాడుతూ విప్లవ రచయితలను, మేధావులను, తీవ్ర నిర్బంధాలకు గురిచేస్తున్న నేపథ్యంలో ఏమాత్రం వెరవకుండా స్పష్టంగా తాను చెప్పదలుచుకున్న విషయాలకు దర్పణం ఈకథల పరిచయం పుస్తకం అన్నారు.వర్తమాన సామాజిక సమాజంలో ఫైనాన్స్ పెట్టుబడి చేస్తున్న విధ్వంసాన్ని, సంక్షోభాన్ని, కుటుంబ జీవితాల్లోని మనుషుల వ్యక్తిత్వాలను, వెతలను కథల సంపుటి కళ్ళకు కట్టుతున్నదని తెలిపారు. ఉపాధ్యాయుడు మోదుగుల రవికష్ణ మాట్లాడుతూ సమకాలిన సమస్యలకు శ్వేత పత్రం లాంటిది కాయితాల రుజువు పుస్తకం అన్నారు. సభాధ్యక్షులు, అరసం జాతీయ అధ్యక్షులు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 'ఢీ ధీ రణ', 'మరణానంతర జీవితం', 'కంపెనీ తిరణాల' వంటి కథలు ద్వారా రచయిత్రి రుక్మిణి రాసిన 'కాయితాల రుజువు' కథల సంపుటి ఆలోచనలను రేకెత్తిస్తుందని తెలియజేశారు.కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్, విరసం సిఎస్ఆర్ ప్రసాద్, కాపు శ్రీనివాసరావు, ప్రొఫెసర్ వేణుగోపాలరావు, పలువురు రచయితలు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

విచ్ఛిన్నకర బిజెపిని ఓడించాలి : ఎమ్మెల్సీ కెఎస్

ప్రజాశక్తి - మంగళగిరి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

విచ్ఛిన్నకర బిజెపిని రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓడించాలని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఆర్ అండ్ బి బంగ్లా సమీపంలో మధ్యతరగతి ఉద్యోగుల, కార్మికుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి వివికె సురేష్ అధ్యక్షత వహించగా లక్ష్మణరావు మాట్లాడుతూ గత పదేళ్లలో కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వ హయాంలో భారత రాజ్యాంగ వ్యవస్థలను ధ్వంసం చేసే విధంగా పరిపాలన కొనసాగించారని విమర్శించారు. ప్రతిపక్ష రాజకీయ నాయకులపై కేంద్ర సంస్థలను ఉపయోగించి అరెస్టు చేయించడం పరిపాటైందన్నారు. నియంత పాలనకు పరాకాష్టకు చేరిందని, బిజెపి లక్ష్యం దేశంలో ఇతర పార్టీలు ఉండకుండా అదొక్కటే ఉండాలని చెప్పారు. సిఎఎను తీసుకువచ్చి ప్రజలను మతాల వారీగా విడదీసేందుకు యత్నిస్తోందని తెలిరిపారు. బిజెపి ప్రభుత్వ విధానాల వల్ల ఉద్యోగులకు, మధ్యతరగతి ప్రజలకు ఎలాంటి ప్రయోజనమూ లేదని, మధ్య తరగతి వారిపై పన్నులు భారాన్ని పెంచుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో గత పదేళ్లలో వైసిపి, టిడిపి ప్రభుత్వాలు పరిపాలన చేసినప్పటికీ రాష్ట్రానికి ప్రయోజనమేమీ చేకూరలేదని అన్నారు. విభజన చట్టంలోని హామీలను కేంద్ర ప్రభుత్వంతో అమలు చేయించలేకపోయారని విమర్శించారు. రెండు ప్రభుత్వాలు బిజెపికి అనుకూలంగా ఉండి రాష్ట్రానికి తీరని అన్యాయం చేశారని అన్నారు. రానున్న ఎన్నికల్లో మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఇండియా వేదిక తరుపున పోటీ చేస్తున్న సిపిఎం అభ్యర్థి జొన్నా శివశంకరరావు, గుంటూరు పార్లమెంటు స్థానానికి సిపిఐ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జంగాల అజయ్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ అసత్యాలను, అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల పోరాటాలను నిరంకుశంగా అణిచివేయడానికి ప్రయత్నిస్తున్నారని, దేశంలో నియంత పాలన తారాస్థాయికి చేరిందని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యాన్ని చట్టసభల్లో పెంచుకోవడానికి కృషి చేయాలని కోరారు. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వ హయాంలో కాలరాశారని విమర్శించారు. రాజ్యాంగానికి, లౌకిక వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి ప్రమాద ఘంటికలు మోగుతున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో నెట్టబడిందని, దేశవ్యాప్తంగా లక్షలాది మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో ఉన్న టిడిపి, వైసిపి ప్రభుత్వాలు అనుసరించిన విధానాల వల్ల ఆంధ్రప్రదేశ్ వెనుకబడిపోయిందని చెప్పారు. పదేళ్లలో రూ.25 లక్షల కోట్లను ఆంధ్రప్రదేశ్ నష్టపోయిందని అన్నారు. ఈ విధానాలు మారాలన్నా, వాటికి వ్యతిరేకంగా పోరాటాలు బలపడాలన్నా కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థులను రానున్న ఎన్నికల్లో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి జొన్న శివశంకరరావు, నిర్మలా విద్యాసంస్థల డైరెక్టర్ వివి ప్రసాద్, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.నేతాజీ, ఎస్ఎస్ చెంగయ్య పాల్గొన్నారు.

సర్వమత సమానత్వానికి ప్రతీక ఇఫ్తార్

ప్రజాశక్తి-గుంటూరు

రంజాన్ మాసంలో ఇఫ్తార్ సర్వమత సమానత్వానికి ప్రతీక అని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక భాష్యం గోరంట్ల టెన్త్ క్యాంపస్‌లో చైర్మన్ రామకృష్ణ భాష్య విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ముస్లిమ్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న ముస్లిమ్ సోదరులు సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. అరబిక్ లెక్చరర్ డాక్టర్ షేక్.మహ్మద్ ఇషాక్ నద్వి ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో రామకృష్ణ పాల్గొన్నారు. అనంతరం ఇఫ్తార్‌విందును రామకృష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో ముస్లిమ్ మతపెద్దలు, భాష్యం విద్యా సంస్థల డైరెక్టర్ భాష్యం హనుమంతరావు పాల్గొన్నారు.



నేడు వర్శిటీకి న్యాక్ కమిటి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నేషనల్ అసెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) నేడు ముందస్తు కమిటీ విభాగాలను పరిశీలిస్తారని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.కరుణ ఆదివారం తెలిపారు. ఈ మేరకు అన్ని విభాగాలు ఉదయం 9 గంటలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ముందస్తు కమిటీ పర్యటన వివరాలు విభాగాధిపతులకు పంపినట్లు తెలిపారు. కమిటీకి తగు సమాచారం అవ్వాలని సూచించారు. వర్శిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ కెవి రావు, జెఎన్‌టియుకె యూనివర్శిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వివిఎస్ కుమార్, నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ జి.మోహన్‌రావు, యోగి వేమన యూనివర్శిటీ మాజీ వీసి ప్రొఫెసర్ కె.రామచంద్రరెడ్డిలతో పాటు వర్శిటీ అధజకారులు విభాగాలను పరిశీలిస్తారని తెలిపారు.



ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలి

పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో కలెక్టర్ ఆధ్వర్యంలో భారీ బైక్‌ర్యాలీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా వచ్చేనెల 13న జరగనున్న పోలింగ్‌లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పల్నాడు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎల్.శివశంకర్ పిలుపునిచ్చారు. ఆదివారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని మున్సిపల్ కార్యాలయం వద్ద నుండి పల్నాడు రోడ్డులో గల ఎస్ఎస్ఎన్ కళాశాల వరకు ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. నరసరావుపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, స్వీప్ నోడల్ అధికారి నాగిని పరిధిలో ఏర్పాటు చేసిన ఈ బైక్ ర్యాలీని కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బైక్‌లు నడుపుతూ వారూ ర్యాలీలో భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించే విధంగా ఓటర్ నమోదు కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలను చైతన్య పరుస్తూ అర్హులైన అందరినీ ఓటర్‌గా నమోదు చేస్తున్నామని చెప్పారు. పోలింగ్ రోజున ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటిస్తుందని, ప్రతి ఒక్కరూ తమ అమూల్యమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అన్ని ప్రాంతాల్లో ఆయా ఓటర్‌లకు అందుబాటులోనే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశామని చెప్పారు. మన హక్కులకు భంగం కలిగితే ఎలా ప్రశ్నిస్తామో అదేవిధంగా అర్హులైన ప్రతి ఒక్కరూ మే 13న ముందుకు వచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకొవడానికి గానూ ఓటర్లలో విశ్వాసాన్ని పెంపొందిస్తున్నామని, అందులో భాగంగానే కేంద్ర బలగాలు ఆధ్వర్యంలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద, గత ఎన్నికలలో ఘటనలు జరిగిన ప్రాంతాల్లో పోలిస్ కవాతు ప్రదర్శన నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రజలు భయమేమీ లేకుండా నిర్భయంగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్ర, జిల్లా సరిహద్దుల వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు తోపాటు గట్టి నిఘా ఉంచామని, ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని చెప్పారు. డబ్బు, మద్యం, తదితర వాటినీ సీజ్ చేస్తున్నామన్నారు. జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ మాట్లాడుతూ ఓటర్ నమోదు అవగాహన (స్వీప్ యాక్టివిటీ) కార్యక్రమంలో భాగంగా ఓటర్లను చైతన్య పరుస్తున్నామన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు మేరకు మే 13న పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతయుతంగా మెలిగి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

భవిష్యత్ ఎలక్ట్రికల్ వాహనాలదే

- ఇంధన భారం,కాలుష్యం లేకుండా ఇ-వాహనాలు.. 100 శాతం రాయితీ
- ఇజిగో ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాల వర్క్‌షాప్‌లో కంపెనీ ప్రతినిధులు, డీలర్లు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పర్యావరణ పరిరక్షణతో పాటు పెరుగుతున్న పెట్రోల్ డీజిల్ ధరలతో పోటీ పడలేని సామాన్య, మధ్యతరగతి, ప్రజలకు, మహిళలకు, విద్యార్థులకు, వ్యాపారులకు, అన్ని ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా రూపొందించిన ఇజిగో ఇ-వాహనాలపై ప్రజలు మొగ్గుచూపుతున్నారని నరసరావుపేట మణికంఠ ట్రేడర్స్ (ఇజిగో షోరూమ్) అధినేతలు ఎం.శ్రీనివాసరెడ్డి, ఎం.సాంబశివరావు అన్నారు. ఆదివారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణంలోని వినుకొండ రోడ్డులో ఓ హోటల్లో వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేశ్శారు. కంపెనీ నూతనంగా రూపొందించిన నూతన వాహనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మణికంఠ ట్రేడర్స్ అధినేతలు శ్రీనివాసరెడ్డి, సాంబశివరావు మాట్లాడుతూ సత్తెనపల్లి రోడ్డులో ఇటీవల స్థాపించిన మణికంఠ ట్రేడర్స్‌లో ఇజీగో ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాల విక్రయాలు జరుగుతున్నాయన్నారు. అత్యాధునిక నాణ్యతా ప్రమాణాలతో 110 కిలోమీటర్లకుపైగా మైలేజ్ ఇవ్వగలిగే వాహనాన్ని రూ.లక్షకు అందజేస్తున్నట్లు తెలిపారు. దీనిపై 100 శాతం రాయితీలు 20 నెలల్లో విడతల వారీగా వివిధ రూపాల్లో అందిస్తామన్నారు. ప్రముఖ వ్యాపార సలహా నిపుణులు నల్లబోయిన కాళహస్తి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా భవిష్యత్‌లో ఎలక్ట్రికల్ వాహనాలే ప్రత్యామ్నాయమవుతాయన్నారు. మధ్య తరగతి ప్రజలు, రైతులు, కార్మికులు పెరుగుతున్న ఇంధన ధరలతో ఎదుర్కొంటున్న సవాళ్లను ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం ద్వారా ఎదుర్కోవాలన్నారు. సవాళ్లను అవకాశాలుగా మార్చుకోవాలని సూచించారు. ఇప్పటికే మార్కెట్‌లో ఉన్న ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాల ధరలతో పోలిస్తే ఇజిగో వాహనాల ధరలు 40 శాతం తక్కువన్నారు. పెట్రోల్ డబ్బులు ఆదా చేసుకోవడంతో పాటు 100 శాతం రాయితీ వర్తించే వెసులుబాటున్న ఇజిగో వాహనాలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో డీలర్లు కెవి రావు, కృష్ణారెడ్డి, మల్లికార్జునరావు, జి.మధుబాబు, ఎస్.మణికంఠ పాల్గొన్నారు.